నవతెలంగాణ 1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం 12 జూన్ 2023



యోగాతో ఆరోగ్యం.. ఆనందం

సెక్టోరల్ ఆఫీసర్ రామస్వామి

నవ తెలంగాణ - సిద్దిపేట

యోగాతో ఆరోగ్యం... ఆనందం కలుగుతాయని ప్రతి ఒక్కరూ యోగ చేయాలని సెక్టోరల్ ఆఫీసర్ రామస్వామి అన్నారు. సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మనకు ఎలాంటి రోగాలు రావద్దు, ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ యోగ చేయాలని అన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు డాక్టర్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వేసవికాలంలో మీ యొక్క సమయాన్ని ఇలాంటి శిబిరంలో పాల్గొనడం వల్ల ఎంతో సద్వినియోగం అవుతుందని అన్నారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్ మాట్లాడుతూ ఆరోగ్య సిద్దిపేట హరీశ్ రావు ఆశయం మేరకు ఆరోగ్య సిద్దిపేటలో భాగంగా సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ,వ్యాస మహర్షి యోగా సొసైటీ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న మని అన్నారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ నాగరాజ్ రెడ్డి, సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి , యోగా శిక్షకులు తోట సతీష్, సంధ్య , యోగ అసోసియేషన్ సభ్యులు మనీషా ,కవిత , వంశీ ,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చదువు కోసం పల్లెకు అడుగులు



- అద్భుత ఫలితాలు రాబడుతున్న శేర్‌పల్లి పాఠశాల
- ప్రయివేట్‌కు దీటుగా ముందుకెళ్తున్న సర్కార్ బడి
- ఆకట్టుకుంటున్న ఉపాధ్యాయుల క్రమశిక్షణ, ప్రత్యేక బోధన
- పాఠశాలను ఉన్నతంగా నిలబెట్టిన ఉపాధ్యాయుల సమష్టి కృషి

నవ తెలంగాణ-దౌల్తాబాద్



ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలంటే అభివృద్ధికి నోచుకోకపోవడం, ఉపాధ్యాయులు సరైన సమయానికి రాకపోవడం, వచ్చినా సరిగా పాఠాలు చెప్పకపోవడం వంటి ఎన్నో అపవాదులు నిత్యం మనకు వినిపిస్తుంటాయి. కనిపిస్తుంటాయి. వీటితో పాటు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం సక్రమంగా ఉండకపోవడంతో వేలాదిమంది విద్యార్థులు ప్రయివేట్ బాట బడుతున్నారు. దీంతో సర్కార్ పాఠశాలల మనుగడ రోజురోజుకు మరింత దిగజారుతోంది. ఈ అపవాదలను తలదన్నే విధంగా ఓ సర్కార్ బడి ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా ముందుకెళ్తోంది. సమయపాలన, క్రమశిక్షణతో పాటు విద్యార్థులు మెరుగైన ఫలితాలు అందుకోవడంతో పాఠశాల పేరు మండల వ్యాప్తంగా మారుమోగుతోంది. ప్రయివేట్‌కు మించిన విద్యనందిస్తున్న పాఠశాలపై ప్రత్యేక కథనం...

అద్భుత ఫలితాలు

దౌల్తాబాద్ మండలంలోని శేర్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల నుంచి అద్భుత ఫలితాలు రాబడుతోంది. పాఠశాలను గత మూడు నాలుగేండ్ల నుంచి ఉపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, రవి, శ్రీనివాస్ అన్నివిధాలుగా ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నారు. పాఠశాలలో ఉన్న ఇబ్బందులపై దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి కృషిచేశారు. నాలుగేండ్ల క్రితం పాఠశా లలో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. తీవ్ర ఆవేదనకు గురైన ఉపాధ్యాయులు విష్ణు, రవి, శ్రీను ఇతర ఉపాధ్యాయ సిబ్బంది సాయంతో ఎలాగైనా విద్యార్థుల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. అందుకు ఆంగ్లబోధన అవసరమని, విద్యార్థులను ఆకర్షించాలంటే స్మార్ట్ బోధన అవసరమని గ్రహించారు. అందుకనుగుణంగా విద్యార్థులు తొందరగా అర్థం చేసుకునేలా చార్టుల రూపంలో బోధన, ఆంగ్లంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఉపాధ్యాయుల సమష్టి కృషితో కొంత మెరుగైన ఫలితాలు రాబట్టారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి

శేర్‌పల్లి పాఠశాల పేరు మండల వ్యాప్తంగా మారుమోగడానికి ప్రత్యేక కారణం ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టడమే. విద్యార్థులకు చదవడం, రాయడం, చతుర్వేద ప్రక్రియలపై ప్రత్యేక దృష్టిపెట్టి, ప్రతినెలా జరిగే పేరంట్స్ టీచర్స్ మీటింగ్‌లో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వినిపించడం... అలాగే డ్రిల్లింగ్, హోమ్ వర్క్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో సత్ఫలితాలు వస్తున్నాయి. నాలుగు సంవత్సరాలుగా విశేషంగా కృషి చేయడంతో పాఠశాల ఎన్‌రోల్‌మెంట్ ఏకంగా 52 నుంచి 125కి చేరింది. వీటితో పాటు క్రమశిక్షణ, సమయపాలన, పరిశుభ్రత, నైతిక విలువలపై ప్రత్యేక దృష్టిపెట్టి విద్యార్థుల ప్రగతే లక్ష్యంగా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారు.



మండల కేంద్రం నుంచి పల్లెకు చదువులు

మామూలుగా ఏ విద్యార్థి అయినా పట్టణం లేదా మండల కేంద్రంలో చదవుకోవడానికి ఆసక్తి చూపుతారు. ఇందుకు విరుద్ధంగా విద్యార్థులు దౌల్తాబాద్ మండల కేంద్రం నుంచి శేర్‌పల్లి ప్రాథమిక పాఠశాలకు 3 ఆటోల్లో 75 మందికి పైగా విద్యార్థులు వస్తున్నా రంటే ఇక్కడి ఉపాధ్యాయుల కృషిని అర్థం చేసుకోవచ్చు. అక్కడి విద్యార్థుల తల్లిదండ్రులు శేర్‌పల్లిలో చదవిండంపై ఆనంద వ్యక్తం చేస్తు న్నారు. వారానికి నాలుగు పిరియడ్లు ఆటలు, యోగా పుస్తక పఠనం, అందమైన చేతిరాతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ విద్యార్థుల భవిష్యత్ బాటలు వేస్తున్నారు.

రూపురేఖలు మారిన శేర్‌పల్లి పాఠశాల

మూడు నాలుగేండ్ల నుంచి ఉపాధ్యాయులు విష్ణు, రవి, శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెరుగైన ఫలితాలు రాబట్టిన శేర్‌పల్లి పాఠశాల చదువులో మరింత ముందడుగు వేస్తోంది. విద్యార్థులు సమయం వృథా చేయకుండా పాఠాలు నేర్చుకుంటున్నారు. ఏ విద్యార్థి ఏ సబ్జెక్ట్‌లో వెనకబడి ఉన్నాడో గుర్తించి ఆ సబ్జెక్ట్ సులువుగా అర్థం చేసుకునేలా బోధన చేయిస్తున్నారు. సైన్స్‌డేలో సందర్భంగా పాఠశాలల తయారు చేసిన పరికరాలు ఆకట్టుకుంటున్నాయి. అన్నింటికంటే పాఠశాలలో చెప్పుకోదగ్గ విషయం ఏంటంటే ఉపాధ్యాయులు మరీ అత్యవసరమైతే తప్ప సెలవుల జోలికి వెళ్లరు. శేర్‌పల్లిని ఆదర్శంగా తీసుకుని మరిన్ని సర్కార్ బడులు ముందుకు నడవాలని ఆశిద్దాం.







నేటినుంచి పాఠశాలలు పునఃప్రారంభం





నవ తెలంగాణ - సిద్దిపేట

ఈ నెల 12 తేదీ నుంచి బడులు పునఃప్రారంభం కానున్నాయి. సుమారు నెల రోజులు మూగపోయిన పాఠశాలలు మళ్లీ బడి గంట శబ్దాలతో, పిల్లల అల్లర్లతో కళకళలాడనున్నాయి. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12న విద్యాలయాల తలుపులు తెరుచుకోబోతున్నాయి. పట్టణాలలో మున్సిపల్ సిబ్బంది, గ్రామాలలో గ్రామపంచాయతీ సిబ్బంది పాఠశాలలను శుభ్రపరుస్తున్నారు. జిల్లాలో అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలలు కేజీబీవీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, గురుకులాలు, మోడల్ స్కూల్స్ అన్నీ కలిసి 1260 పాఠశాలలు ఉన్నాయి. 1,79,998 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి మొదటి విడత కింద 5,91,059 పుస్తకాలు అవసరం కాగా 5,31,690 మాత్రమే పుస్తకాలు వచ్చాయి. 90 శాతం అన్ని మండలాలకు విద్యాశాఖ అధికారులు పంపిణీ చేశారు. రెండో విడత అక్టోబర్ నెలలో 1,67,461 సెట్-టు పుస్తకాలు రానున్నాయి. ఈసారి 6 నుండి 10వ తరగతి చదివే విద్యార్థులకు నోట్ బుక్స్ కూడా ప్రభుత్వం అందించేందుకు చర్యలు తీసుకుంది. 4,84,760 నోట్ బుక్స్‌కుగాను 79,300 మాత్రమే వచ్చాయి. 649 ఉపాధ్యాయ పోస్టులు జిల్లాలో ఖాళీగా ఉన్నాయి. ఈ సంవత్సరం బడిబాట కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 5612 విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానాలలో విద్యా వలంటీర్లను నియమించుకోవడానికి ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. దీంతో విద్యార్థులకు కొంత ఇబ్బందులు తప్పవని చెప్పొచ్చు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి, ఉపాధ్యాయుల నియామకం జరిగే వరకూ విద్యా వలంటీర్లు నియమించి విద్యాబోధన జరిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్యలతో స్వాగతం పలుకుతున్న విద్యా సంవత్సరం
ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్

సమస్యలతో నూతన విద్యా సంవత్సరం స్వాగతం పలుకుతున్నదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రెడ్డమైన అరవింద్ అన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఇంతవరకు పాఠ్య పుస్తకాలు రాలేదని, రెండు జతల యూనిఫామ్స్ రాలేదన్నారు. ప్రభుత్వ హాస్టల్లలో చదివే విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచలేదన్నారు.

గ్రామాలల్లో ప్రభుత్వ బడులలో చదువుకోవాలని బడిబాట చేబడుతున్నా బోధన చేసేందుకు టీచర్ల నియమకాలు చేయడం లేదన్నారు. జిల్లా కేంద్రంలో అనేక కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్స్ అధికంగా పెరిగాయని అధికారులకు చెప్పినా ఆయా యాజ్యమాన్యాలకే అనుకూలంగా ఉన్నారని అన్నారు. కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక గ్రామాల నుండి వచ్చే విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో విద్యార్థులందరినీ ఏకం చేసి చేసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

జోరుగా మట్టిదందా

- అక్రమార్కులకు అధికారుల అండ
- మట్టి రవాణాను రెండు రోజులుగా అడ్డుకుంటున్న గ్రామస్తులు
- అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదని ఆరోపణ
- పట్టిచ్చిన లారీ మాయమైందన్న గ్రామస్తులు

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

మనోహరాబాద్ మండలంలో రాత్రి సమయంలో మట్టిదందా అక్రమంగా యథేచ్ఛగా కొనసాగుతోంది. గ్రామ ప్రజలు అడ్డుకోవాలని చూస్తే వారిపై అక్రమార్కులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. రాత్రి సమయంలో రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శనివారం రాత్రి కాపాలాకాసి వీఆర్ఏల సహాయంతో లారీని పట్టించినా దాన్ని అధికారులు వదిలేసినట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని జీడిపల్లి గ్రామ శివారులో ఓ ప్రైవేటు పరిశ్రమకు ప్రతి నిత్యం కొందరు అధికార పార్టీ నాయకులు అధికారుల అండదండలతో రాత్రి సమయంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. రెండు రోజులుగా గ్రామానికి చెందిన సాయికుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు కలిసి మట్టి రవాణాను అడ్డుకుని లారీలను ఆపేసి రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసినట్టు తెలిపారు. అయినప్పటికీ అధికారుల నుంచి సమాధానం లేకుండా పోయిందని, పోలీస్ వంద నంబర్‌కు డయల్ చేసి చెప్పినా కనీసం పోలీసులు రాలేదని ఆరోపించారు. తిరిగి శనివారం రాత్రి రెవెన్యూ అధికారులకు ఫోన్ చేయగా తహసీల్దార్ స్పందించి వీఆర్ఏలను పంపించినట్టు తెలిపారు. ఒక లారీని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్టు గ్రామస్తులు తెలిపారు. అయినప్పటికీ లారీ స్టేషన్ వరకు వెళ్లకుండానే మాయమైనట్టు ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల అండదండలు ఉంటే వదిలేస్తారా? అంటూ తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు అధికారులు మట్టి అక్రమ వ్యాపారాన్ని అడ్డుకోవాలని, మైనింగ్ సెస్ కట్టి మట్టిని తరలిస్తే ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశాలు ఉంటాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



ప్రశాంతంగా గ్రూప్ వన్ ప్రిలిమ్స్ పరీక్ష

పరీక్ష సెంటర్లను పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి జీవన్ పాటిల్, సీపీ శ్వేత

నవ తెలంగాణ - సిద్దిపేట

జిల్లాలో గ్రూప్ వన్ ప్రిలిమ్స్ పరీక్ష పటిష్టమైన పోలీస్ బందోబస్తు మధ్య ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని 20 కేంద్రాలలో గ్రూప్ వన్ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ పాటిల్, పోలీస్ కమిషనర్ శ్వేత పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ సెంటర్లలో తిరుగుతూ పరీక్ష విధానాన్ని పరిశీలించారు. ఉదయం స్ట్రాంగ్ రూమ్ నుండి పరీక్ష కేంద్రాలకు పరీక్ష పేపర్లను తరలించడంతో పాటు పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షా తీరును కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష అన్ని శాఖల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించామన్నారు. జిల్లాలో 20 కేంద్రాలలో 7786 మంది అభ్యర్థులను పరీక్ష రాసేందుకు టీఎస్పీఎస్సీ కేటాయించగా, 5366 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని, 2420 గైర్ హాజర్ తో 68.92 శాతం హాజరయ్యారని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ను పోలీసులు అమలుపరిచారు. 10 గంటల 15 నిమిషాల తర్వాత పరీక్ష కేంద్రంలోకి ఎవరిని అనుమతించవద్దు అనే నిబంధన ఉండడంతో, వివిధ సెంటర్ల వద్ద ఎనిమిది మంది విద్యార్థులు ఆలస్యంగా రావడంతో, వారిని పరీక్ష కేద్రంలోకి నిర్వాహకులు అనుమతించకపోవడంతో విద్యార్థులు ఏడ్చుకుంటూ వెనుతిరిగారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే కేంద్రాలలోకి నిర్వాహకులు అనుమతించారు.



పరీక్ష మధ్యలో వెళ్లి వచ్చిన వ్యక్తిపై కేసు

నవ తెలంగాణ - సిద్దిపేట

టిఎస్పిఎస్సి నిబంధనలకు విరుద్ధంగా గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరై, పరీక్ష పూర్తి సమయం మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష కేంద్రంలో ఉండకుండా, ప్రారంభం సమయంలోనే పరీక్ష ప్రశ్నాపత్రం కూడా ఇవ్వకముందే ఉదయం 10.15 గంటలకు పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిన అర్బన్ మండలం ఇబ్రిచెప్యాల గ్రామానికి చెందిన అభ్యర్థి బి.ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన టి.ఎస్.పి.ఎస్.సి గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష రాసేందుకు ఉదయం నిర్ణీత సమయంలోపు పరీక్ష కేంద్రానికి చేరుకున్న అతను 10 గంటల 15 నిముషాలకు ముందుగా పరీక్ష నిర్వాహకులు ఇచ్చిన ఆన్సర్ ఓఎంఆర్ షీట్‌లో తన హాల్ టికెట్ నంబరును తప్పుగా నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని గ్రహించిన అభ్యర్థి తాను చేసిన పొరపాటును గుర్తించి, పరీక్ష రాసిన తనకు మార్కులు పడవనే ఉద్దేశంతో, ఇంకా ప్రశ్నాపత్రం కూడా ఇవ్వకముందే ఓఎంఆర్ షీట్‌ను పరీక్ష హాల్‌లో వదిలి, పరీక్ష పూర్తి సమయం మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష కేంద్రంలో ఉండకుండా, ఉదయం 10 గంటల15 నిమిషాలకే పరీక్షా కేంద్రం బయటకు వచ్చాడని తెలిపారు. దీన్ని గమనించిన పోలీస్ సిబ్బంది అతనిని అరెస్టు చేసి తెలంగాణ పబ్లిక్ ఎగ్జామ్స్ మాల్ ప్రాక్టీస్ యాక్ట్ 1997 ప్రకారం అతనిపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా సిద్దిపేటలోని 20 పరీక్ష కేంద్రాలలో గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నవ తెలంగాణ - సిద్దిపేట

అండర్ 18 విభాగంలో రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు జిల్లా నుండి క్రీడాకారుల, క్రీడాకారునిల ఎంపిక చేసినట్లు జిల్లా సిమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బర్ల మల్లికార్జున్, కార్యదర్శి గుండి ప్రవీణ్ లు తెలిపారు. ఆదివారం సిద్దిపేట స్విమ్మింగ్ పూల్‌లో సిద్దిపేట జిల్లా సిమ్మింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఎంపికల కోసం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా క్రీడా శాఖ అధికారి నాగేందర్ , స్థానిక మంత్రి హరీశ్ రావు సహకారంతో అండర్ 18 బాలబాలికల స్విమ్మింగ్ ఎంపికలు చేయడం జరిగిందని, ఇందులో సుమారు 110 మంది బాల, బాలికలు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 18న సికింద్రాబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు

ఫ్రీ స్టైల్ 50 మీటర్స్‌లో యహశ్విన్, రిషిత్ రాజ్, అనిర్వేశ్, ఫ్రీ స్టైల్ 100 మీటర్స్‌లో పి.యహశ్విన్, పి అనిర్వేశ్, శ్రీ ప్రాద్, బటర్ఫ్లై 50 మీటర్సలో పి అనిర్వేష్, తనై, జి సుప్రీత్, బ్రెస్ట్ స్ట్రోక్ 50 మీటర్‌లో సంతోష్, అనిర్వేశ్, నిహాల్ నారాయణ, బ్యాక్ స్ట్రోక్ 50 మీటర్స్‌లో రిషిత్ రాజ్, అనిర్వేశ్, సుహాన్, బాలికలు ఫ్రీ స్టైల్ 50 మీటర్స్ శ్రీ కల, శృతిక, శ్రీవల్లి రెడ్డి, ఫ్రీ స్టైల్ 100 మీటర్ లో కృత్తికా రెడ్డి, శృతిక, బ్రెస్ట్ స్ట్రోక్ 50 మీటర్సలో శ్రీకళ, శ్రీవల్లి రెడ్డి, యు శ్రీవల్లి, బ్యాక్ స్ట్రోక్ 50 మీటర్స్ లో శ్రీకళ, శ్రీవల్లి రెడ్డి, శ్రీవల్లి తదితరులు ఎంపికయ్యారని తెలిపారు. కోచులు అక్బర్ నవాబ్, కనకయ్య, సంజీవ్, ప్రదీప్, రవి, అరుణ్, తిరుపతి, నగేష్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



సంక్షిప్త వార్తలు

13న సిద్దిపేటలో మేగా జాబ్ మేళా

నవతెలంగాణ-నంగునూరు

ఈ నెల 13న సిద్దిపేటలో మేగా జాబ్ మేళాను విజయవంతం చేయాలని నంగునూరు మండల మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి రెడ్డి తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సిద్దిపేట నిరుద్యోగ విద్యార్థి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశలు కల్పించుట కోసం జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 13వ తేదీన పోలీస్ కన్వెన్షన్ హల్ లో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.నంగునూరు మండలంలోని ప్రతి ఒక్క నిరుద్యోగ యువతీ యువకులు అందరూ హాజరై ఈ జాబ్ మేళాను విజయవంతం చేయవలసిందిగా మనవి చేశారు.జాబ్ మేళాకు వచ్చే నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లు తీసుకొని జాబ్ మేళాకు హాజరై సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

మెగా హెల్త్ క్యాంపులో 200 మందికి పరీక్షలు



నవతెలంగాణ-దుబ్బాక

లయన్స్ క్లబ్, వైశ్య సంఘం, అద్వైత హాస్పిటల్ సంయుక్త సహకారంతో దుబ్బాక పురపాలిక కేంద్రంలోని వైశ్య భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంపును మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి ప్రారంభించారు. అనంతరం చైర్ పర్సన్ దంపతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయుర్వేదిక్, హోమియోపతి ఉచిత మెగా హెల్త్ క్యాంపులో సుమారు 200 మంది వరకు పరీక్షలు చేసుకున్నారని దుబ్బాక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కూర వేణు తెలిపారు. దుబ్బాక వైశ్య సంఘం ప్రతినిధులు వెనిశెట్టి సుభాష్, పడమటింటి శంకర్, పడమటింటి ఆంజనేయులు, గుజ్జ ఆంజనేయులు, తుమ్మశంకర్, పలువురు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఉచిత సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షులు పూదరి దత్తాగౌడ్ కోరారు. ఆదివారం హుస్నాబాద్ మండల కేంద్రంలో మల్లెచెట్టు చౌరస్తాలో ఉచిత లయన్స్ విజన్ సెంటర్ ను లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ పూదరి దత్తాగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జపాన్ కంప్యూటర్ తో ప్రతి రోజు కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు.కంటిలో శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా కరీంనగర్ లోని రేకుర్తిలో కంటి శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. ఉచిత రవాణా భోజన వసతులు కల్పిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ విజన్ కేర్ అధ్యక్షులు లయన్ మాదర్ ఖాన్, లయన్ షకీల్, లయన్ తమ్మనవేని రవీందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి



నవతెలంగాణ జగదేవపూర్

హ్యాపీబర్త్ డే సర్పంచ్ నరేష్ అంటూ రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు ఆశీర్వదించారు. జగదేవపూర్ మండలం సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షుడు, చాట్లపల్లి సర్పంచ్ రాచర్ల నరేష్ జన్మదినం సందర్భంగా ఆదివారం హైదరాబాదులో మంత్రి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి మంత్రి హరీష్ రావు ఆశీర్వాదం తీసుకున్నారు. కేక్ కట్ చేసి శాలువా కప్పి హరీష్ రావు సర్పంచ్ నరేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయాలని, రాజకీయాలలో మరింత రాణించాలని, సూచించారు. ఆయురారోగ్యాలతో బాగుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ డిసిసిబి డైరెక్టర్ ములుగు అంజిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గుండ రంగారెడ్డి, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు కావ్య దర్గయ్య, మండల కో ఆప్షన్ సభ్యుడు ఏక్బాల్, జగదేవపూర్ ఉప సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షుడు బింగి మల్లేశం తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతే లక్ష్యంగా నేచర్ ఐకాన్ యూత్ స్వచ్ఛభారత్

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా యువత చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమం 269వ వారానికి చేరుకుంది. మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యువత గత 269 వారాలుగా స్వచ్ఛభారత్ కార్యక్రమాలను చేపడుతూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. పాఠశాలలకు సెలవులు సోమవారంతో ముగుస్తుండడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో ఆదివారం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే హరిత హారంలో నాటిన మొక్కలకు పాదులను తీసి నీటిని పోశారు. మొక్కల పెంపకంపై ప్రతి ఒక్కరు దృష్టిపెట్టాలని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని గ్రామస్తులకు నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు అవగాహన కల్పిస్తున్నారు. నేచర్ ఐకాన్ యూత్ చేపడుతున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు మండలంలోని గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.



సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో చేరడానికి దరఖాస్తుల ఆహ్వానం

సహాయ సాంఘిక సంక్షేమ అధికారి మల్లేశం

నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట సహాయ సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో గల వసతి గృహాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలు చేరడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి మల్లేశం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సిద్దిపేట సహాయ సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 9 వసతి గృహాలు బాలురకు, ఐదు వసతి గృహాలు బాలికలకు ఉన్నాయన్నారు. 3 నుండి 10వ తరగతి వరకు బాల, బాలికలు చేరవచ్చని, నోట్ బుక్స్, పాఠశాల ద్వారా పాఠ్య పుస్తకాలు, బెడ్డింగ్ మెటీరియల్, మంచాలు, కంచాలు, కటోరాలు, నాలుగు జతల బట్టలు, ఉలెన్ రగ్గులు, స్వెటర్స్ మంకీ క్యాప్స్, ప్రతినెల కాస్మెటిక్ చార్జెస్ ఇవ్వబడునని, డైనింగ్ టేబుల్ భోజన వసతి కలదని, ప్రతి నెల వైద్యులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించబడునని, స్కూల్ బ్యాగ్స్, స్పోర్ట్స్ షూ, ఫార్మల్ షూ, పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ అందించడం జరుగుతుందన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ట్యూటర్స్‌చే ప్రత్యేక బోధనా జరిపించబడునని తెలిపారు. బాలుర కొరకు ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సిద్దిపేటలో 160 ఖాళీలు, ఇంటిగ్రేటెడ్ హాస్టల్ దుబ్బాకలో 150, చిన్నకోడూర్ లో 83, పాలమాకులలో 42, బెజ్జంకిలో 76, శనిగరంలో 66, దౌల్తాబాద్ లో 56, హుస్నాబాద్ లో 63, మిరుదొడ్డిలో 63, బాలికల కోసం ఆనంద నిలయం సిద్దిపేటలో 53, సిద్దిపేటలో 51, గట్ల మల్యాలలో 25, హుస్నాబాద్ లో 74, దుబ్బాక హాస్టల్లో 100 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9000019730లో సంప్రదించాలని సూచించారు.

ముదిరాజులు రాజకీయంగా సామాజికంగా ఎదగాలి

నవతెలంగాణ-మద్దూరు

ముదిరాజులు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా ఎదగాలని మాజీ సైనికుడు డాక్టర్ కన్నల్ మాచర్ల బిక్షపతి ముదిరాజ్ అన్నారు. దూల్మిట మండల కేంద్రంలో ముదిరాజ్ ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి మద్దూరు మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు చొప్పరి సాగర్ ముదిరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ సైనికుడు డాక్టర్ కల్నల్ మాచర్ల బిక్షపతి ముదిరాజ్ హాజరై మాట్లాడుతూ జాతి ఐక్యమత్యంలో భాగంగా గ్రామగ్రామాలు తిరుగుతూ ముదిరాజ్ జాతి రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదుగుదలకు సమావేశాలను నిర్వహించాలన్నారు. వారిని చైతన్య పరుస్తూ జాతి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తుండాలన్నారు. జాతి అభివృద్ధి జరగాలంటే పిల్లలను ఉన్నతమైన విద్యలు చదివేలా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. యువత మద్యం, మారకద్రవ్యాలు, పోలీస్ కేసులకు దూరంగా ఉండాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను సాధించి, రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో దూల్మిట్ట ముదిరాజ్ సంఘం అధ్యక్షులు లింగం, ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల సదానందం ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సురేష్ పాల్గొన్నారు.



కర్ణాటక మంత్రులకు ఘన స్వాగతం పలికిన నాయకులు



నవతెలంగాణ-న్యాల్‌కల్

కర్ణాటక క్యాబినేట్ మంత్రులు హైదరాబాద్ నుంచి కర్ణాటక వెళుండగా మామిడ్గి శివారులోని ఎస్ఎస్వి రెస్టారెంట్ వద్ద టపాకాయలు పేల్చుతూ నాయకులు పాటిల్ సంగప్ప పాటిల్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే బాల్కి, అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ కండ్రే , బీదర్ ఎమ్మెల్యే మున్సిపల్ మరియు హజ్ మంత్రి రహీమ్ ఖాన్ తదితరులను సంగప్ప పాటిల్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం రావడంతో తెలంగాణలో కాంగ్రెస్ నాయకుల్లో మరింత ఉత్సాహం కనిపిస్తున్నదన్నారు. నాయకులు మామిడ్గి సర్పంచ్ చంద్రప్ప, ఉపసర్పంచ్ శరణయ్య స్వామి, నాయకులు వ్యాపారవేత్త సంగప్ప పాటిల్, తుక్కారెడ్డి, కాశీనాథ్, మాణిక్ రెడ్డి, రాములు, సంజీవరెడ్డి, రాజిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ఎస్ఎస్వి నిర్వాహకుడు సచిన్ తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఓ వరం



నవతెలంగాణ-సదాశివపేట

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మెన్ చింతా ప్రభాకర్ అన్నారు. ఆదివారం సదాశివపేట పట్టణానికి చెందిన లబ్దిదారునికి రూ.1,20,000 చెక్కును అందజేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఎంతోమంది పేదలు కార్పొరేట్ వైద్యం చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ చింతా గోపాల్, మున్సిపల్ కౌన్సిలర్ విద్యాసాగర్ రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు కోడూరు అంజయ్య, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి పిల్లి గుండ్ల వీరేశం, నాయకులు ముబిన్,ఖాజా,ప్రదీప్ జైన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రూ.5 లక్షల ప్రొసీడింగ్ అందజేత

నవతెలంగాణ-సంగారెడ్డి

కలబ్‌గుర్ దర్గా శాద్దు నిర్మాణానికి ప్రజల కోరిక మేరకు ప్రజలకు ఇచ్చిన హామీ రూ.5 లక్షల రూపాయల ప్రొసీడింగ్‌ను క్యాంపు కార్యాలయంలో టీఎస్‌హెచ్‌డీసీ చింతా ప్రభాకర్ ఆదివారం అందజేశారు. కలబ్‌గుర్ దర్గా శాద్దు నిర్మాణానికి కృషి చేసిన మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు చక్రపాణి, సర్పంచ్ పాండు, మైనార్టీ ఉప అధ్యక్షులు అంజాద్, గ్రామ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరిక

నవతెలంగాణ-రాయికోడ్


మండల పరిధిలోని పంపాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్రోల సురేష్, అలాగే, సుధాకర్, పెంతయ, శేకర్‌లు స్థానిక ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వాన రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రజనీకాంత్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సంగమేశ్వర్,నాయకులు యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి తెలంగాణ రన్ విజయవంతం చేయండి

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నేడు ఉదయం 6 గంటలకు తెలంగాణ రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డి డీఎస్పీ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తెలంగాణ రన్ కార్యక్రమం జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ప్రారంభమై న్యూ బస్టాండ్ చేరుకొని, అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంతో ముగుస్తుందన్నారు. ఈ తెలంగాణ రన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎ.శరత్, జిల్లా ఎస్పీ రమణ కుమార్ జిల్లా ప్రముఖులు ప్రజాప్రతినిధులు పాల్గొనడం జరుగుతుందన్నారు. కావున సంగారెడ్డి పట్టణ ప్రజలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని ఈ తెలంగాణ రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఇక్రిశాట్ నుంచి మైత్రి మైదానం వరకు తెలంగాణ రన్



నవతెలంగాణ-పటాన్‌చెరు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు పోలీస్ ఆధ్వ ర్యంలో జరిగే తెలంగాణ రన్‌ను విజయవంతం చేయాలని పటాన్‌చెరు సీఐ వేణు గోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నేడు ఉదయం 6 గంటలకు ఇక్రిశాట్ నుంచి పట్టణంలోని మైత్రి క్రీడ మైదానం వరకు రన్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ రన్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రమణ కుమార్ పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపా ల్‌రెడ్డి, డీఎస్పీ భీమ్‌రెడ్డితోపాటు ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నట్లు చెప్పారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

సీనియర్ జర్నలిస్టు మృతి పట్ల సీపీఐ(ఎం) సంతాపం

నవతెలంగాణ-సదాశివ పేట

సదాశివపేట సీనియర్ జర్నలిస్టు విజయ్‌కుమార్ మరణం పట్ల సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సంతాపం ప్రకటించింది. గత అనేక ఏండ్ల నుంచి జర్నలిజంలో పని చేస్తున్న ఆయన మరణం బాధాకరమని కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహి తులకు బంధువులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ మృతునికి నివాళ్లర్పించారు.

కీర్తిశేషులు టి.అశోక్‌రెడ్డి అంత్యక్రియలు



నవతెలంగాణ-కొండాపూర్

మండలానికి చెందిన టి.అశోక్‌రెడ్డి అంత్యక్రియలు అనంతసాగర్ గ్రామంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి సర్దార్ హాజరై మాట్లాడుతూ.. ఉద్యోగ రీత్యా అశోక్‌రెడ్డి రైతులకు సేవా చేశారని గుర్తు చేశారు. అలాగే ఉద్యోగుల యూనియన్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా ఉండి, తమ సాటి ఉద్యోగులకు అందుబాటులో ఉండి ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు అందించారన్నారు. ఆయన మృతితో తీరని లోటు ఏర్పడిందని, మరణం పట్ల సంతాపం తెలియజేసి వారి కుటుంబ సభ్యు లకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు మాట్లాడు తూ.. అశోక్‌రెడ్డి రైతులకు అందించిన సేవలు మరువలేనివని, ఇతను ఎల్లవేళలా ఉద్యోగుల యూనియన్ నాయకునిగా ఉండే వారన్నారు. అందరూ ఉద్యోగులకు మేలు చేశారని, ఇతని అడుగుజాడల్లో ప్రస్తుతం ఉన్న ఉద్యోగులు అందరు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్గౌడ్, కోశాధికారి ఈశ్వరప్ప, రంగారెడ్డి జిల్లా యూనియన్ అధ్యక్షులు బి.గణేష్, ఉపాధ్యక్షులు రాందాస్ గారు, సంగారెడ్డి జిల్లా ఉద్యోగుల యూనియన్ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, ప్రస్తుతం జిల్లా అధ్యక్షులు స్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నవీన్, మెదక్ జిల్లా యూనియన్ అధ్య క్షుడు వెంకటస్వామి, వివిధ సంఘాల ఉద్యోగులు, ఎం.డీ సిరాజ్,సాబీర్, మధు సూదన్‌రెడ్డి, సంగమేశ్వర్, బ్యాంకు సూపెర్వైజర్ చంద్రశేఖర్, ఏసీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.



మల్లికార్జున స్వామి జాతరలో పాల్గొన్న రాజేశ్వర్‌రావు దేశ్ పాండే

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి నియోజక వర్గం లోని కల్పగూర్ గ్రామంలో గల శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లి కార్జున స్వామి జాతర కళ్యాణ మహో త్సవంలో బీజేపీ సంగారెడ్డి అసెంబ్లీ ఇంచార్జ్ రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే పాల్గొన్నారు. ఆయన తోపాటు బీజేపీ సంగారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు, బీజేపీ సంగా రెడ్డి మండల అధ్యక్షులు పాపన్న, ఓబీసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి సురేందర్, విజయ్, మణికంత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుల వృత్తుల వారి జీవితాల్లో వెలుగులు



నవతెలంగాణ-సదాశివపేట

కుల వృత్తుల మీద ఆధారపడ్డ వారి జీవితాల్లో తెలంగాణ సర్కార్ వెలుగులు నింపుతున్నదని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మెన్, మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. ఆదివారం సదాశివపేట పట్టణంలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్న నేపథ్యంలో అర్హులైన లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవడానికి వీలు కల్పిస్తూ ఉచిత ఇంటర్నెట్ సెంటర్‌ను లబ్దిదారుల సౌక ర్యార్థం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. కుల వృత్తుల మీద ఆధారపడ్డ జీవితాలకు చేయూతనివ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది అన్నారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి పిల్లి గుండ్ల వీరేశం, మున్సిపల్ కౌన్సిలర్ విద్యాసాగర్ రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు కోడూరి అంజయ్య, పట్టణ యువత అధ్యక్షులు బిట్ల ప్రేమ్ కుమార్, మైనారిటీ నాయకులు మోబిన్, ఖాజా, నాయకులు ప్రదీప్ జైన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబదాస్, శ్రీనివాస్‌కు భారతదేశ గౌరవ పురస్కారం





నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన సంగారెడ్డి జిల్లా ఆల్ ఇండియా సంస్థ మాజీ అధ్యక్షులు, దళిత రత్న కాసాల అంబదాస్, మండల కేంద్రమైన జిన్నారానికి చెందిన దళిత రత్న ఏర్పుల శ్రీనివాస్‌లు భారతదేశ గౌరవ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాదులోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో మయూరి ఆర్ట్స్ సంస్థ వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న ఆల్ ఇండియా మమతా సైనిక్ దళ్ సంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు దళితరత్న కాసా అంబదాస్, ఆలిండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, దళిత రత్న శ్రీనివాస్‌లకు ఈ భారతదేశ గౌరవ పురస్కారాన్ని(ఇండియన్ అనరబుల్ అవార్డు)ను మయూరి ఆర్ట్స్ సంస్థ చైర్మన్ రాధా, సినీ డైరెక్టర్ రవి శర్మ ఎస్ ఆర్ ట్రస్ట్ గోదావరి అంజిరెడ్డి ,డైరెక్టర్ నీలిమ మిస్ సౌత్ ఇండియా బృందం బహుకరించి అభినందించారు. అవార్డు అందుకున్న సందర్భంగా కాసాల అంబదాస్ ఏర్పుల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండి చేపడుతున్న సామాజిక కార్యక్రమాలను ఇతర సేవ కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకొని భారతదేశ గౌరవ పురస్కారాన్ని అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సదరు సంస్థకు ప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారంతో సామాజిక సేవా పరమైన బాధ్యతలు మరింతగా పెరిగాయంటూ మిత్రులకు, కుటుంబ సభ్యులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

- అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి
- రూ.కోటి 75 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు రూపకల్పన చేస్తున్నామని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఓడిఎఫ్ కాలనీ, సాయి భగవాన్ కాలనీలో ఒక కోటి 60 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్లు, సాయి కృపా కాలనీలో రూ.15 లక్షలతో చేపట్టనున్న అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో శరవేగంగా నూతన కాలనీలు, ఏర్పడుతున్నాయని, ఇందుకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు బిజిలి రాజు, అనిరుద్ రెడ్డి, కృష్ణ, నవనీత జగదీష్, చంద్రకళ గోపాల్, రాములు, బాలమని బాలరాజు, పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



నవతెలంగాణ-పటాన్‌చెరు

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీల అభివృద్ధికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి అన్నారు.పటాన్ చెరు మండలం పోచారం గ్రామ పరిధిలోని సాయి దర్శన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న చిల్డ్రన్స్ పార్క్, దేవాలయం, కమ్యూనిటీ హాల్, కాలనీ ముఖద్వారం నిర్మాణ పనులకు ఆదివారం స్థానిక కాలనీవాసులతో కలిసి గూడెం మధుసూదన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయిదర్శన్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు, జీవిఆర్ ఎంటర్ప్రైజెస్ సహకారంతో నిధులు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకటరావు, కాలనీ వాసులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వివిధ శుభకార్యాల్లో పాల్గొన్న వై.నరోత్తం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ కల్యాణ మండపాల్లో ఆదివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానుల శుభకార్యాలల్లో టీపీసీసీ నాయకులు వై.నరోత్తం హాజరై వధూవరులను ఆశీర్వదించారు. జహీరాబాద్ పట్టణంలోని పటేల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఝరాసంగం మండలం గంగాపూర్ గ్రామం నబిసాబ్ సోదరుని మనుమడి వివాహానికి, న్యాల్‌కల్ మండలం ముంగి గ్రామం యస్.ఎల్.ఆర్.ఫంక్షన్ హాల్‌లో జరిగిన మాసుల్దార్ సయ్యద్ యాదుల్ కుమార్తె వివాహాలకు హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలోమాజీ సర్పంచ్ శంకర్, శ్రీనివాస్ రెడ్డి, మహ్మద్ యూసుఫ్, వెంకట్ రెడ్డి, యస్. నర్సారెడ్డి, కే నర్సింహారెడ్డి, చెంగల్ జైపాల్, శ్రీనివాస్, యం.వెంకట్, షఫీ, మౌలానా, ఖలీల్, గఫార్, బందేల్లి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని దోమడుగు నర్సంపల్లి నర్సారెడ్డి అనారోగ్యంతో మరణించడంతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ మరియు కొత్తపల్లి గ్రామంలో చాకలి సాయికుమార్ అనారోగ్యంతో మరణించడం పట్ల ఇరు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ తన వంతు సహాయంగా అంత్యక్రియల నిమిత్తం ఆయా గ్రామాల బిఆర్ఎస్ పార్టీ నాయకుల చేతుల మీదుగా ఒక్కరికి పదివేల చొప్పున 20వేల రూపాయలను అందజేయించారు. కొత్తపల్లి సర్పంచ్ బానోత్ ఆంజనేయులు ఎంపీటీసీ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు వెంకటేశం, సత్తయ్య లక్ష్మీనారాయణ కిష్టయ్య, దోమడుగు గ్రామ కమిటీ అధ్యక్షులు కడలి మురళి మంగయ్య అంజిరెడ్డి రామిరెడ్డి శ్రీనివాస్ శేఖర్ రాజు తదితరులు ఉన్నారు.

జహీరాబాద్‌లో ఉరుములు, మెరుపుల వర్షం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంతోపాటు మండలంలో అకస్మాత్తుగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం ఒకేసారి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో వాతావరణం చల్లబడిపోయింది. ఈదురు గాలులు వేయడంతో చెట్లు పెద్ద సంఖ్యలో నెలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం జరిగింది.

సామాజిక సేవలో ప్రజల భాగస్వామ్యం పెరగాలి



నవతెలంగాణ-రామచంద్రాపురం

సామాజిక సేవలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం పెరగాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారతీ నగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీలో మ్యాక్ ఫ్రంట్ లైన్ టీం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన పీపుల్స్ ఎలైట్ ఈవెంట్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి తోడుగా సామాజిక సేవలో మ్యాక్ ఫ్రంట్ లైన్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. సమాజం మాకు ఏమి ఇస్తుంది అని ఆలోచించకుండా సమాజానికి నేను ఏమి చేస్తున్నాను అన్న సమున్నత లక్ష్యంతో ముందుకు రావడం నేటి యువతరానికి స్ఫూర్తిని అందిస్తోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పారిశుధ్య కార్మికులను బహుమతులతో అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్, రామచంద్రపురం సిఐ నరేందర్ రెడ్డి, బిహెచ్ఇఎల్ రిటైర్డ్ ఈడి ఉదయ్ కుమార్, టిఆర్ఎస్ పార్టీ సర్కిల్ అధ్యక్షులు పరమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పృథ్వీరాజ్, టీం సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు

బీసీ కులాలన్నింటికీ రూ.లక్ష రుణం ఇవ్వాలి



- మైత్రీ ఫౌండేషన్ చైర్మెన్, బీజేపీ జిల్లా నాయకులు చెన్నంశెట్టి ఉదయ్ కుమార్
- ఉద్యమకారుడు మంద భాస్కర్ రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-గుమ్మడిదల

బీసీ కులాలన్నింటికీ లక్ష రూపాయల రుణం ఇవ్వాలని మైత్రీ ఫౌండేషన్ చైర్మెన్, బీజేపీ జిల్లా నాయకులు చెన్నంశెట్టి ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం అహర్నిశలు పోరాడి.. ప్రస్తుతం ఎలాంటి జీవనో పాధికి నోచుకోకుండా ఇబ్బందులు పడు తున్న ఉద్యమ కారుడు మంద భాస్కర్‌రెడ్డిని ఆదివారం మెమొంటో, శాలువాతో ఉదయ్‌కుమార్ సన్మానించారు. ఈ సందర్భంగా మంద భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిజమైన ఉద్యమ కారులు, కళాకారులను, తనతోపాటు మరెందరినో ముఖ్యమంత్రి కేసీఆర్ విస్మరించాడన్నారు. నాడు రాష్ట్రం కోసం పోరాడిన తామే నేడు కేసీఆర్‌కు గుణపాఠం చెప్పడానికి ముందు వరుసలో ఉంటామని హెచ్చరించారు. ఈ సంద ర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదేండ్ల నుంచి బీసీల సంక్షేమాన్ని మరిచి.. నేడు లక్ష రూపాయల పథకాన్ని ప్రకటించి మరోమారు మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీసీల్లో 130 కులాలు ఉండగా కేవలం 14 బీసీ కులాలకు వందకోట్ల రూపాయలను కేటాయించి బీసీ కులాల మధ్య చిచ్చు పెట్టడానికి చూస్తున్నారన్నారు. కేవలం రూ.100 కోట్ల నిధులతో 62 లక్షల బీసీ కుటుంబాల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నదన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఒక్క బీసీలకు కూడా రుణాలు మంజూరు చేయలేదని విమర్శించారు. 2016-17లో మూడు లక్షల అరవై ఐదు వేల దరఖాస్తులు స్వీకరించి ఒకరికైనా రుణాన్ని మంజూరు చేశారా అని ప్రశ్నించారు. గత ఎన్నికల సమయంలో కూడా రుణాలు ఇస్తానని దరఖాస్తు స్వీకరించి వాటిని మూలకు పడేశారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంకా ఎన్ని సంవత్సరాలు ఇలా మోసపూరిత హామీలతో పబ్బం గడుపుతారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఉన్న బీసీ వర్గాలకు ప్రతీ కుటుంబానికి లక్ష చొప్పున లబ్ధి చేరే విధంగా వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కొత్తగూడెం ప్రజా గర్జనకు బయల్దేరిన నాయకులు



నవతెలంగాణ-జహీరాబాద్

భద్రాద్రి కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ప్రజా గర్జన బహిరంగ సభకు జహీరాబాద్ నుంచి సీపీఐ నాయకులు తరలివెళ్లారు. ఈ మేరకు ప్రయాణ బస్‌లను సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలోద్దిన్ పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సీపీఐ ముందుకు అడుగేస్తున్నదన్నారు. పెట్టు బడిదారులకు మోడీ కొమ్ము కాస్తున్నారన్నారు. కేంద్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ సామాన్య, మధ్య తరగతి, పేదప్రజాలపై పెనుభారాలు మోపుతున్నారని ఆరోపించారు. వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువులపై భారాలు మోపుతూ పేద ప్రజల నడ్డి విరుస్తు న్నారన్నారు. అందుకని సీపీఐ ఆధ్వర్యంలో బీజేపీ కో హటా వో.. భారత్ కో బచావో అనే నినాదంతో భారత్ దేశం అంత టా మే 25 నుంచి ప్రజాపోరు జీపు జాతలు నిర్వహించి ఆదివారం ప్రజాగర్జన బహిరంగ సభను నిర్వహించా మన్నారు. రాబోయే రోజుల్లో కమ్యూనిస్టులు ప్రజాపోరా టాలకు సిద్ధం కావాలన్నారు. బయల్దేరి వెళ్లినవారిలో సీపీఐ డివిజన్ కార్యదర్శి నర్సిములు మైనోద్దీన్, రాజు, సుధాకర్, కృష్ణ, శ్రీనివాస్, సంజీవ్, స్వరూప, కళావతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పున: ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ-పటాన్‌చెరు

నేటి నుంచి (జూన్ 12 నుండి) ప్రారంభమయ్యే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూర్చడం జరిగిందని మండల విద్యాధికారి పిపి రాథోడ్ పేర్కొన్నారు. తాగు నీరు, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలు శుభ్రం చేయించి పాఠశాలల పున: ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయులందరు పాఠ శాల పున: ప్రారంభం రోజు విద్యార్థులకు ఉచిత యూ నిఫాం పుస్తకాలు తమ తమ స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేయాలని సూచి ంచారు. నేటి నుంచి తరగతులు ప్రారంభం అవుతున్న ందున తల్లితండ్రులు తమ పిల్లలను సకాలంలో పాఠశాలకు పంపాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే తల్లి తండ్రులు పాఠశాలల్లో చేర్పించక ముందే ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందో లేదో తెలుసుకొని ప్రభుత్వ గుర్తిం పు ఉన్న పాఠశాలల్లో మాత్రమే చేర్పించాలన్నారు. గుర్తింపు లేని పాఠశాలల్లో చేర్పిస్తే.. విద్యాశాఖ బాధ్యత వహించదన్నారు. అనుమతి పొందని ప్రైవేటు పాఠశాలల యజమానులు త్వరగా జిల్లా విద్యాధికారి ద్వారా అనుమతి పొందాలని, రెన్యువల్ చేయించుకోలేని పాఠశాలలు కూడా త్వరలో దరఖాస్తు చేసుకొని రెన్యువల్ అనుమతి పొందాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

'ధూప దీప నైవేద్య పథకం' పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు



నవతెలంగాణ-సదాశివపేట

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ధూప దీప నైవేద్య పథకాన్ని అమలు చేసినందుకు సదాశివపేట శ్రీ దుర్గా భవాని ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్రోళ్ల నాగరాజు గౌడ్, కమిటీ సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞత తెలిపారు. ఈ మేంకు ఆదివారం రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మెన్ చింతా ప్రభాకర్‌కు శాలువా కప్పి బొకే అందజేసి కృతజ్ఞత తెలిపారు. అనంతరం ఆలయాభివృద్ధి కోసం తరఫున సహకారం అందించాలని.. అదేవిధంగా గుడి పునర్నిర్మాణానికి కమిటీ సభ్యులు చింత ప్రభాకర్‌ను కోరగా సానుకూలంగా స్పందించి ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయి, ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్ర నాగరాజ్ గౌడ్, కమిటీ సభ్యులు కనిగిరి శంకర్, ఎర్ర శ్రీహరి, ఎర్ర రమేష్ గౌడ్, ఎర్ర గణేష్ గౌడ్, ఎర్ర నర్సింలు గౌడ్, కనిగిరి కృష్ణ గౌడ్, ఎర్ర శ్రీనివాస్ గౌడ్, ఎర్ర భగవాన్ గౌడ్, ఎర్ర వీరేందర్ గౌడ్, ఎర్ర వెంకటేష్ గౌడ్, కనిగిరి ధనరాజ్ గౌడ్, ఎర్ర పాలనేత్ర గౌడ్, ఎర్ర శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి రూ.10,000 ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం


'తన జన్మదిన వేడుకల్లో బిజీగా ఉన్నా.. ఆపదలో ఉన్నవారికి నేను ఉన్నానంటూ' బొల్లారం బీజేపీ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి అపన్న హస్తం అందిస్తున్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైయస్సార్ కాలనీలో నివాసముంటున్న శ్రీకాకుళానికి చెందిన మురళీకృష్ణ రింగ్ రోడ్ నుంచి వస్తుండగా వాహనం ఢీకొని గాయపడ్డాడు. కాలికి గాయానికి వైద్యం కోసం రూ.50 వేల ఖర్చు అవుతున్నది. వారిది అసలే నిరుపేద కుటుంబ.. అంతేకాకుండా డ్యూటీకెళ్తే గాని డొక్కాడని పరిస్థితి.. ఈ విషయం తెలుసుకున్న బిజపి బొల్లారం మున్సిపల్ టౌన్ అధ్యక్షుడు ఆనంద్ కృష్ణారెడ్డి ఆదివారం బాధితుడికి ఇంటికెళ్లి పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి తనవంతుగా పదివేల రూపాయలు సాయం చేశారు. మురళి, కృష్ణ, బాధితుడి భార్య విజయ కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి పాఠశాలల పున: ప్రారంభం

నవతెలంగాణ-న్యాల్‌కల్

వేసవి సెలవులు పూర్తి కావడంతో.. నేటి నుంచి విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయని మండల విద్యాధికారి మారుతి రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. మండల ప్రభుత్వ పాఠశాలలో 250 మంది విద్యార్థులు బడిబాటలో చేరారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి సౌకర్యాలు కల్పిస్తూ.. నాణ్యమైన విద్యకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్న దన్నారు. మండలంలోని 67 పాఠశాలలు ఉన్నాయని.. పాఠ్య పుస్తకాలు 70 శాతం వచ్చాయని, 9000 పుస్తకాలు రావాల్సి ఉందన్నారు.

నవతెలంగాణ
మెదక్
సోమవారం 12 జూన్ 2023



దరఖాస్తు ప్రతులను అధికారులకివ్వాల్సిన అవసరం లేదు



నవతెలంగాణ-మెదక్‌టౌన్, రూరల్

బీ.సీ కుల వృత్తులు, చేతివృత్తుల వారికి ఆర్థిక సహాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సరిపో తుందని, హార్డ్ కాపీ సమ్పరించాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా వివరణ ఇచ్చింద న్నారు. 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు కలిగి, వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాలలో లక్షన్నర, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉన్న వారు ఆర్థిక సాయం పొందుటకు అర్హులన్నారు. కుటుంబ ంలోని ఒకరికి మాత్రమే ఈ ఆర్థిక సహాయం వర్తిస్తుందని, గత ఐదేండ్లలో ఏ ప్రభుత్వ శాఖ నుండి లబ్ధిపొందినా అనర్హులన్నారు. అర్హత గల బీ.సి.కుల వృత్తుల వారు ఈనెల 20 లోగా వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో దరఖాస్తూ చేస్తూ కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు,బ్యాంకు ఖాతా వివరాలు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో లు అప్ లోడ్ చేయాలని సూచించారు. తిరిగి భౌతికంగా అట్టి జిరాక్స్ ప్రతులు విధిగా మండల పరిషద్ అభివృద్ధి అధికారి లేదా మున్సిపల్ కమీషనర్ కు సమర్పించాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

మండల పరిధిలోని గోపని వెంకటాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మైసమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఆదివారం నిర్వహించిన హెూమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని, ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ ఛైర్మెన్ సువర్ణ అంజయ్య,వార్డు సభ్యులు సంగయ్య,కిష్టయ్య, నాయకులు మోహన్,రామాగౌడ్,గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సాయిలు,మల్లయ్య చంద్రయ్య గ్రామస్థులు పాల్గొన్నారు.



పార్శనాథున్ని దర్శించుకున్న ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి

నవతెలంగాణ-కొల్చారం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొల్చారంలోని జైన దేవాలయాన్ని సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి ఆదివారం సందర్శించి పార్శనాథున్ని దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్సీ కి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్ సుమిత్ చంద్ పాండ్యా, బీఆర్ఎస్ సీనియర్ నాయుకులు సంతోష్‌కుమార్, రాజాగౌడ్, వెంకటేశం తదితరులు ఉన్నారు.



గ్రూప్ వన్ పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-నర్సాపూర్

ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ వన్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివి రాజు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన గ్రూప్ వన్ పరీక్షలకు మొత్తం 1211 మంది అభ్యర్థులు పరీక్షలకం హాజరు కావాల్సి ఉండగా 779 మంది అభ్యర్థులు మాత్రమే హాజరై పరీక్షలు రాశారు. 432 మంది అభ్యర్థులు పరీక్షలకు గైరాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ ప్రియదర్శిని పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరిశీలిం చారు.



బాధితుడికి జెడ్పీటీసీ ఆర్థిక సాయం

నవతెలంగాణ-నర్సాపూర్

మండల కేంద్రమైన శివంపేట గ్రామానికి చెందిన వడ్ల శంకరప్పకు ప్రమాదవశాత్తు కాలు విరిగింది. ఈ విషయం తెలుసుకున్న జడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా ఆదివారం బాధితుడిని పరామర్శించి తన వంతు సహాయంగా రూ.5 వేల నగదునుఅందజేశారు. ఆయన వెంట సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ రాజపేట పద్మా వెంకటేష్ ,గ్రామ కమిటీ అధ్యక్షులు లక్ష్మీ నరసయ్య,వార్డు సభ్యులు జ్యోతి బాలేష్, పత్రల దేవేందర్ గౌడ్ తదితరులున్నారు.




సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ఆదివారం హై స్కూల్ ఆవరణలో దివ్యాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దివ్యాంగులకు వెయ్యి రూపాయల పెన్షన్ పెంపు పై హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో సంక్షేమ ఫలాలను అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ అన్ని వర్గాల వారికి సమన్యాయం కల్పిస్తున్న సీఎం కేసీఆర్ కు తెలంగాణ ప్రజలు ఎల్లవేళలా రుణపడి ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో దివ్యాంగులునాగరాజు, దేవరాజు, బాలయ్య, గ్రామస్తులు శ్రీనివాస్, సాయి,తదితరులు పాల్గొన్నారు.

నేను ఎవరి భూమిని కబ్జా చేయలేదు..




నవతెలంగాణ-వెల్దుర్తి

తాను ఎవరి భూమిని భూకబ్జా చేయలేదని.. చట్టప్రకారమే స్వతంత్ర సమరయోధుడు రాఘవులు నారాయణరెడ్డి వద్ద నుండి ఖరీదు చేసి కొనుగోలు చేసుకుని రిజిస్టర్ చేసుకున్నట్టు వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన కొమిరిశెట్టి రమేష్ చంద్రగుప్త తెలిపారు. కావాలనే కొందరు తనను బెదిరిస్తూ భూమిని లాక్కోవడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మండల పరిధి మానేపల్లి గ్రామానికి చెందిన స్వతంత్ర సమరయోధుడు రాఘవులు నారాయణరెడ్డి తండ్రి కృష్టారెడ్డి అనే వ్యక్తికి 1984లో మండల కేంద్రంలోని సర్వేనెంబర్ 216లో 10 ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం కేటాయించిందన్నారు. 1985లో నారాయణరెడ్డి వారి కొడుకుల సమక్షంలో వారి వద్ద నుంచి ఖరీదు చేసి పూర్తి డబ్బులు చెల్లించి చట్ట ప్రకారం రామాయంపేటలో రిజిస్టర్ చేసుకున్నానన్నారు. అప్పటినుండి నేటి వరకు దాదాపు 38 ఏండ్ల భూమిని కాస్తు చేస్తూ వివిధ రకాల పంటలు పండిస్తూ బతుకుతున్నామన్నారు. అయితే గత శనివారం భూమికి సంబంధం లేని వ్యక్తులు కొంతమంది నారాయణరెడ్డి కొడుకులకు లేనిపోని అబండాలు నేర్పి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించాడు. 2016లో ఇలాగే బెదిరిస్తే.. ఊర్లో నలుగురి పెద్దల సమక్షంలో మాట్లాడగా అప్పటి పెద్దల సమక్షంలో ఈ భూమికి మాకు ఎలాంటి సంబంధం లేదు అని వారు రాసి ఇచ్చిన రసీదు పత్రం కూడా తమ వద్ద ఉన్నదన్నారు. మరికొంత కాలం తర్వాత మరల మాభూమి అని వస్తే పూర్తి డాక్యుమెంట్లతో సహా కోర్టులో సమర్పించడం జరిగిందన్నారు. కాగా గత శనివారం రోజున భూమికి సంబంధం లేని వ్యక్తులు తమ భూమి వద్దకు వచ్చి ఆరాచకం చేశారని.. ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ అరాచకానికి పాల్పడిన వ్యక్తులపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

సేవాలాల్ ఉత్సవాలకు మైక్‌సెట్ అందజేత

నవతెలంగాణ-నర్సాపూర్



శివంపేట మండల పరిధిలోని మల్లుపల్లి తండాలో సేవాలాల్ ఉత్సవాల సందర్భంగా ఆదివారం జెడ్పీటీసీ పబ్బుమహేష్ గుప్తా తన సాయంగా రూ.25 వేల విలువచేసే మైక్ సెట్‌ను నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ ,మాజీ మండల పార్టీ అధ్యక్షులు పిట్ల సత్యనారాయణ, శివంపేట సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, వార్డు మెంబర్ కృష్ణ ,రాజేష్ ,హరి చందు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాఖ్యాన చక్రవర్తి.. మల్లినాధసూరి

- సమైక్య పాలనలో పట్టింకోని ప్రభుత్వాలు
- స్వరాష్టంలో మల్లినాథసూరి విశిష్టతలను గుర్తించిన సీఎం కేసీఆర్
- ఆయన స్వగ్రామం కొల్చారంలో స్మారక సంస్కృత విశ్వవిద్యాలయం ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న సాహితీలోకం



నవతెలంగాణ-కొల్చారం

వ్యాఖ్యాన చక్రవర్తి, మహాకవి మల్లినాథసూరి వైభవం ఇక దశదిశలా చాటనున్నది. మహా మహెూపాధ్యాయ బిరుదుతో సంస్కృత సాహిత్య వ్యాఖ్యానకర్తగా ప్రసిద్ధి చెందిన శ్రీ కోలాచల మల్లినాథసూరి స్వగ్రామమైన మెదక్ జిల్లా మండల కేంద్రమైన కొల్చారం గ్రామం కావడం ఇక్కడి ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆయన పేరున స్మారకార్థం సంస్కృత విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడంపై సాహితీ వేత్తలే కాకుండా మెదక్ ప్రాంత వాసులు మరింత హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వాలు ఆయన స్మారకార్థం పై స్పందించకపోయినా.. స్వరాష్ట్రంలో ఇదే ప్రాంతానికి చెందిన సీఎం కేసీఆర్ మహాకవి మల్లినాథసూరి విశిష్టతలను గుర్తించి తెలుగు జాతి గర్వించేస్థాయిలో గుర్తింపు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడంపై జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకలు వ్యక్తమవుతున్నాయి. అలాగే మల్లినాథసూరి స్మారక సంస్కృత విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం అవసరమైన కార్యాచరణ రూపొందించాలని సీఎం కేసీఆర్ ఇటీవల రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఆదేశించారు. ఈమేరకు మే నెల 17న రాష్ట్ర ఉన్నత విద్యా కౌన్సిల్ ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిలు కొల్చారం లో స్థల పరిశీలన చేశారు.





మల్లినాథసూరి విశిష్టతలు..

మల్లినాథసూరికి విద్య వంటబట్టకపోవడంతో పశువులు కాసేందుకు అతడిని పంపేవారట. గ్రామానికి సమీపంలోని (ప్రస్తుతం బస్టాండు సమీపంలోని) తిరుమలయ్య గుట్టపై త్రికాలజ్ఞాని ఉన్నాడని తెలిసి, మల్లినాథసూరి నిత్యం అక్కడికి వెళ్లి సపర్యలు చేసేవాడు. యోగి అవసాన దశలో మల్లినాథసూరిని పిలిచి వీణాపాణి మహాసరస్వతీ మంత్రోపదేశం చేసి నాలుకపై బీజాక్షరాలు లిఖించిన అనంతరం సారస్వత మంత్రం ఉపదేశించి, వనదుర్గామాత సాక్షాత్కార్యం పొంది, మహాపండితుడవు అవుతావని ఆశీర్వదించడంతో ఈ క్షేత్రంలో కొంతకాలం తపస్సు చేశారు. అక్కడి నుంచి వారణాసికి వెళ్లి కాశీ విశ్వనాథుడిని దర్శించుకుని, అక్కడ ఓ గురువు వద్ద తర్క, మీమాంస, న్యాయ, వ్యాకరణ, చంధోశాస్త్రాలు, వేదాంత, వైద్యశాస్త్రం, జ్యోతిష్య శాస్త్రం, సంగీత, అశ్వ, గజ, రత్న, రాజనీతి వంటి 19 శాస్త్రాల్లో ప్రావీణ్యం సాధించి మహా భాషకర్తగా, విద్యాసారంగతుడిగా కీర్తి సాధించా డు. మల్లినాథసూరి వ్యాఖ్యా నాలపై ఆచార్య పీజీ లాలే 1981లో ఉస్మాని యా విశ్వవిద్యాలయం నుంచి మల్లి నాథ మనీషా పేరిట ఒకటి, కేంద్ర సాహిత్య అకాడమీ నుంచి మల్లినాథ పేరిట పరిశోధనా గ్రంథాలు వెలువరించారు.

వ్యాఖ్యాన చక్రవర్తి, మహెూపాధ్యాయుడు

పంచకావ్యాలైన మహాకవి కాళిదాసు విరచిత రఘువంశం, కుమార సంభవం, మేఘసందేశం, కవి భారవి రాసిన కిరాతార్జునీయం, మాఘుడు రాసిన శిశుపాలవధలకు మల్లినాథసూరి వ్యాఖ్యానాలు చేశారు. హర్షనైషదంకు కూడా వ్యాఖ్యానం చేయడమేకాక భట్టి కావ్య వ్యాఖ్య, ఏకావళీ వ్యాఖ్య, తంత్ర వార్తి కటీక, స్వర మంజరీ వ్యాఖ్య (పరిమళము), తార్కిక రక్షటీక, జ్యోతిష్య గ్రంథాలకు చక్కని, సుగమమైన వ్యాఖ్యలు రాయడం వల్లే మల్లినాథసూరి వ్యాఖ్యాన చక్రవర్తి అయ్యారట. వ్యాఖ్యానాలు రాసేంతటి ప్రతిభా పాండిత్యాలు ఉండడం వల్లే మల్లినాథుడు మహా మహెూపాధ్యాయుడయ్యారు. క్రీ.శ.14 వ శతాబ్దం చివర, 15వ శతాబ్దం ఆరంభంలో రాచకొండను పాలించిన సర్వజ్ఞ సింగభూపాలుడి ఆస్థాన కవిగా మల్లినాథసూరి ఉన్నట్టు చరిత్ర చెబుతోంది.

సమైక్య రాష్టంలో హరీష్ రావు కోరిక మేరకు..

సమైక్య రాష్ట్రంలో వేద పాఠశాల, గ్రంథాలయం ఏర్పాటు కోసం కొల్చారం గ్రామస్థులు ఎన్నో సార్లు సమావే శాలు, ఆందోళనలూ నిర్వహించారు. వీటిని ఏర్పాటు చేయిస్తామని ఉమ్మడి రాష్ట్రంలో 2012లో మంత్రిగా ఉన్న సునీతా లక్ష్మారెడ్డి కొల్చారంలో మల్లినాథ సూరి స్మారకార్థం నిర్వహించిన వైభవ సభలో హామీ ఇచ్చారు. ఆనాటి సభలో ప్రస్తుత ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ఎమ్మె ల్యే హెూదాలో పాల్గొని వేద పాఠశాల, గ్రంథాలయం ఏర్పా టు చేయాలని కోరారు. ఆ మేరకు అప్పట్లో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా ఉన్న తోపాజి అనంత కిషన్ గ్రాంథాలయం ఏర్పాటు చేయించారు. గ్రామస్థుల కోరిక మేరకు ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మల్లినాథసూరి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. ఆ విగ్రహాన్నే ఇప్పుడు గ్రంథాలయం ముందు నెలకొల్పారు.

సంస్కృత కవులను, రచయితలను గౌరవించాలి

- సాహిత్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- కొల్చారంలో కోలాచల మల్లినాథసూరి జన్మించడం గర్వకారణం
- నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునితారెడ్డి

నవతెలంగాణ-కొల్చారం



సంస్కృత కవులను, రచయితలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్చారంలో తెలంగాణ సాహిత్య దినోత్సవ వేడుకల్లో భాగంగా కోలాచల మలినాథ సూరి విగ్రహానికి పూలమాలవేసిన అనంతరం కోలాచల మల్లినాథసూరి సాహితీ పీఠం సభ్యులు నిర్వహించిన సాహిత్య నిరాజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సాపూర్ శాసనసభ్యులు చిలుముల మదన్ రెడ్డి తోపాటు మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ సునీత లక్ష్మారెడ్డి, సీఎం కెసిఆర్ రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ.. మహాకవి మలినాథ సూరి కొల్చారం గ్రామంలో జన్మించడం హర్షించదగ్గ విషయం అన్నారు. మల్లినాథసూరి పేరున సంస్కృత మల్లినాథసూరి విశ్వవిద్యాలయాన్ని పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టలో నిర్మించాలని సీఎం కేసీఆర్ ఆలోచన ఉన్నందున నర్సాపూర్ శాసనసభ్యులు చిలుముల మదన్ రెడ్డి ప్రత్యేక కృషితో మల్లినా థ సూరి జన్మస్థలమైన మెదక్ జిల్లా మండల కేంద్రం కొల్చా రంలో నిర్మించినట్లయితే ఆయనను గౌరవించి గుర్తించినట్లు అవుతుందని సీఎం కేసీఆర్‌కు తెలపడంతో కొల్చారంలో స్థల సేకరణ చేయడం జరిగిందని గుర్తు చేశారు. అలాగే ఇందులో భూములు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి నిర్మించనున్న విశ్వవిద్యాలయంలో ఉద్యోగ అవకాశము కల్పించేలా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. అలాగే త్వరలో జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో నూతనంగా నిర్మించిన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలను ప్రారంభించేందుకు వస్తున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ ను కొల్చారం మీదుగా తీసుకువచ్చి మల్లినాథసూరి విశ్వవిద్యాలయం నిర్మాణానికి భూమి పూజ చేయిస్తానని సభాముఖంగా హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర మహిళ కమిషన్ ఛైర్ పర్సన్ సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..గత సమైక్య రాష్ట్రంలో తాను మంత్రిగా ప్రాతినిత్యం వహిస్తున్న తరుణంలో మల్లినాథసూరి పేరున వేద పాఠశాలతో పాటు గ్రంథాలయం నిర్మించాలని ప్రభు త్వం దృష్టికి తీసుకుపోయిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే 14వ శతాబ్దానికి చెందిన కోలాచల మల్లినా థసూరి కొల్చారంలో జన్మించడం అదృష్టంగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివా సులు, తహశీల్దార్ చంద్రశేఖర్ రావు, ఎంపీపీ మంజుల, జెడ్పిటిసి మేఘమాల, సాహితీ పీఠం అధ్యక్షులు జగదీష్ చంద్ర, మల్లినాథసూరి వంశాస్తులు కోలాచల శ్రీనివాస శర్మ, సర్పంచ్ ఉమా రాజాగౌడ్, సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్, ఎంపీటీసీ అరుణ, లేబర్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ దేవేందర్ రెడ్డి, మెదక్ మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మెన్ సావిత్రిరెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ చంద్రగౌడ్, ఆర్‌ఐ ప్రభాకర్ పాల్గొన్నారు.



గ్రూప్-1 ప్రీ లిమినరీ పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-మెదక్‌రూరల్

జిల్లాలోని 7 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన టీఎస్‌పీఎస్సీ ఎస్. సి గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జిల్లాకు 3,293 అభ్యర్థులను కేటాయించగా 2,159 మంది అనగా 65.56 శాతం అభ్యర్థులు హాజరయ్యారని, 1,134 మంది ప్రిలిమినరీ పరీక్షకు హాజరు కాలేదన్నారు. ఎస్పీ రోహిణి ప్రియదర్శినితో కలిసి ఆది వారం నర్సాపూర్‌లోని బి.వి.ఆర్.ఐ.టి. ఇంజనీరింగ్ కళాశా ల, మెదక్‌లోని గీతా జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష సజావుగా జరిగాయని ఎటువంటి సంఘటనలు జరగలేదని స్పష్టం చేశారు.

ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-చేగుంట

మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో గల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని ఆదివారం దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు, మాజీ సర్పంచ్ నాయిని రాజగోపాల్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం డాక్టర్లతో మాట్లాడి కంటి శుక్లాల శాస్త్ర చికిత్సల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం, అలాగే శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం పున ప్రతిష్టం ఈ రెండు కార్యక్రమాలు జరగడం గ్రామ ప్రజల అదృష్టమని,ప్రజలందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రధానమైన కళ్ళను కాపాడు కోవాలన్నారు. రుక్మిణి సత్యభామ వేణుగోపాల స్వామి ఆశీ స్సులతో ప్రజలందరూ బాగుండాలని, పాడి పంట, ఆయు ఆరోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటునా న్నమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

పీకేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 17న మెగా జాబ్ మేళ



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

దివంగత మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 17న నారాయణఖేడ్ నియోజకవర్గ కేంద్రంలో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం పెద్దశంకరంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లగా ఈ ప్రాంతంలో ఉద్యోగాలు లేక పోవడం తో నిరుద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,వారిని దృష్టిలో ఉంచుకొని ఎస్సెస్సీ నుండి పీజీ,డిప్లొమా, ఐటీఐ, ఎంటెక్, బీఈ, బీటెక్ చదివిన నిరుద్యోగులకు 60 కి పైగా కంపెనీలలో ఉద్యోగాలు కల్పించేందుకు 17న శనివారం నారాయణఖేడ్ లోని మా ఫంక్షన్ హాల్లో ఐటి,నాన్ ఐటి, బ్యాంకింగ్, సర్వీస్ సెక్టార్,కాల్ సెంటర్,మానుఫ్యాక్చరింగ్ కంపె నీలు పాల్గొంటున్నాయన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూ.15 వేల నుండి రూ.50 వేల వరకు అర్హతల ఆధారంగా వేతనాలు అందిస్తాయన్నారు. నిరుద్యోగులు క్యూఆర్ కోడ్ లింక్ ద్వారా ఆన్లైన్లో లేదా వ్యక్తిగతంగా వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అభ్యర్థులు తమ ఒరిజినల్స్,జిరాక్స్ కాపీలను తీసుకొని రావాలని, ఎంపికైన వారికి వెంటనే అపాయిమెంట్ ఆర్డర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, సర్పంచ్ అంజిరెడ్డి, ఎంపిటిసి రాజునాయక్, ఖేడ్ నాయకులు వినోద్ పాటిల్, నాయకులు మాజీ సర్పంచ్ సంగమేశ్వర్, రాజు పటేల్, సంగయ్య, రవీందర్, కుంట్ల శ్రీను, షాదుల్ తదితరులున్నారు.

నత్త నడకన నస్కల్ రోడ్డు పూలుగు పనులు

- నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్!
- బీటీ రోడ్డు వేసేదెప్పుడు?
- త్వరగా వేయాలి : గ్రామస్తుల వేడుకలు

నవతెలంగాణ-నిజాంపేట



రాష్ట్ర ప్రభుత్వము వేల కోట్లతో గ్రామీణ రోడ్లను బాగు చేయాలనే సంకల్పంతో నిజాంపేట మండల పరిధిలోని నస్కల్, రాంపూర్, నందగోకుల్, చల్మెడ గ్రామాలకు దాదాపు రూ.12 కోట్ల రూపాయలను కేటాయించింది. అయితే నిజాంపేట మల్కచెరువు కట్టకింద పైప్ లైన్లు వేయడం, పూలుగులను కట్టించడంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా డస్ట్‌తోనే నిర్మిస్తున్నారని.. పూలుగులకు వాటర్ క్యూరింగ్ కూడా చేయడం లేదంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి నస్కల్ రోడ్డును జూన్ నెల వరకు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు, అధికారులకు చెప్పినప్పటికీ.. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో రోడ్డు పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూలుగులను నిర్మించడమే పూర్తి కాలేదని, ఇక బిటి రోడ్డు ఎప్పుడు వేస్తారో ఏమోనంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కాంట్రాక్టర్లు స్పందించి వెంటనే నస్కల్ బిటి రోడ్డు పనులను త్వరితగతిన మొదలు పెట్టేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఎమ్మెల్యే అండదండలతోనే ఇసుక అక్రమ రవాణా?

- అభివృద్ధి పేరిట హైదరాబాద్ తర్లుతున్న ఇసుక
- నర్సాపూర్ మున్సిపల్ ఛైర్మన్ మురళీధర్ యాదవ్
- కొంగోడు హల్దివాగు ఇసుక రవాణా అడ్డగింత

నవతెలంగాణ-కొల్చారం



ఎమ్మెల్యే అండదండలతోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నదని బీజేపీ రాష్ట్ర నాయకులు, నర్సాపూర్ మున్సిపల్ ఛైర్మన్ మురళీధర్ యాదవ్ అన్నారు. ఆదివారం కొల్చారం మండలం కొంగోడు హల్దిబాగులో జెసిబిల సహాయంతో తరలిస్తున్న ఇసుక రవాణాను బిజెపి నాయకులతో కలిసి అడ్డుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇసుక, మట్టి మాఫియా విచ్చలవిడిగా కొనసాగుతుందని ఆరోపించారు. చివరికి చెరువు కుంటలను సైతం అమ్ముకుంటారేమోనని ఎద్దేవా చేశారు. గతంలో ఎంతో మంది ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, జగన్నాథరావు లాంటి వారు పరిపాలన చేయడం చూశామని, ఇలాంటి అక్రమాలకు పాల్పడలేరని గుర్తుచేశారు. పట్టపగలే ఇసుక మాఫియా కొనసాగుతుంటే అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అక్రమాలను బీజేపీ నాయకులు అడ్డుకుంటే అక్రమ కేసులు పెట్టి భయపెట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దుర్మార్గపు పరిపాలనను నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు దయాకర్, కౌడిపల్లి మండల అధ్యక్షుడు రాకేష్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-చేగుంట

పదో తరగతిలో టాప్‌ర్యాంక్ సాధించిన విద్యార్థులు, ఉన్నత చదువులు చదివి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని హైకోర్టు లాయర్ మీర్ అహ్మద్ ఖాన్ అన్నారు. చేగుంట మండలం చందాయిపేట గ్రామంలో ఆదివారం పదో తరగతి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం పాల్గొని 600 మందికి భోజనాలు వడ్డించారు. స్థానిక సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్‌లతో కలిసి నిర్వహించారు. గ్రామానికి చెందిన బో ర సాయికుమార్ పదవ తరగతి 10/10 ఫలితాలు సాధించిన విద్యార్థికి పూల బొకే, శాలువాతో సన్మానించి, విద్యార్థి పై చదువుల కోసం ఆర్థిక సాయం రూ,10 వేలు అందజేశారు. అలాగే 9.6 ఇద్దరికి ఐదు వేలు, 9.3 వచ్చిన వారికి 3వేలు రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా హైకోర్టు లాయర్ జాగిర్దర్ మీర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. తన గ్రామం ఇదే ఊరు, తమ విద్యార్థులకు సన్మానం చేస్తున్నందుకు ఎంతో తృప్తిగా ఉందని, అలాగే విద్యార్థులు బాగా చదివి లాయర్లు, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఎదగి గ్రామానికి మంచి సహకారాలు అందించాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి పదవ తరగతి ర్యాంకులు సాధించి ఇంతకంటే ఎక్కువ మంచి బహుమతులను పొందాలని, గ్రామానికి తమ వంతు సహాయం ఇప్పటికీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మరియం మునిస బేగం, మీర్ ఉమర్ఖాన్, మిర్‌మధ్‌ఖాన్, ఉప సర్పంచ్ సంతోష్ కువార్, వార్డు సభ్యులు రమ్య, అమృత, లావణ్య, శ్రీలత, సాయిబాబా, కోఆప్షన్ సభ్యులు మచ్చ శ్రీనివాస్, భీమని లావణ్య, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అడవి పంది దాడిలో కానిస్టేబుల్‌కు గాయాలు



నవతెలంగాణ-వెల్దుర్తి

అడవి పంది దాడిలో ఓ కానిస్టేబుల్‌కు గాయాలైన ఘటన మండల పరిధిలో కుక్కునూరు గ్రామపంచాయతీ పరిసరాల్లో పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం ఉదయం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు వెల్దుర్తి ఎస్సై మధుసూదన్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హావేళీఘనపూర్ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శంకర్ తన స్వగ్రామమైన శివంపేట నుండి వెల్దుర్తి మీదుగా హవేలి ఘనపూర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహణకు వెళుతున్నాడు. ఈ క్రమంలో కుకునూరు గ్రామ శివారులో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో అడవి పంది దాడి చేయడంతో ద్విచక్ర వాహనంపై నుండి పడ్డాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలపాలయ్యాయి. ఎస్ఐ మధుసూదన్ గౌడ్ ఘటన స్థలానికి వెళ్లి కానిస్టేబుల్ శంకరును తన వాహనంలో తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



తైక్వాండో బెల్ట్ ప్రమోషన్ టెస్ట్



నవ తెలంగాణ - సిద్దిపేట

జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐఎంఏ హాల్లో తైక్వాండో బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తైక్వాండో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ రామ్మోహన్, చీఫ్ ఎగ్జామినర్ గా రాష్ట్ర తైక్వాండో ప్రతినిధి ధనుష్ హాజరయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బెల్టు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ తైక్వాండో నేర్చుకోవడం వలన క్రమశిక్షణ, ఆత్మ రక్షణ, మేధాశక్తి పెరుగుతుందని అన్నారు. మంచి ఆరోగ్యంతో పాటు జాతీయస్థాయి, రాష్ట్ర స్థాయిలో రాణించిన విద్యార్థుల సర్టిఫికెట్లు స్పోర్ట్స్ కోటాలో 2 శాతం రిజర్వేషన్ వర్తిస్తుందని అన్నారు. ఈ పోటీలో 23 మంది విద్యార్థులు ఎల్లో బెల్ట్, 15 మంది విద్యార్థులు గ్రీన్ బెల్ట్, 13 మంది విద్యార్థులు బ్లూ బెల్ట్, 10 మంది విద్యార్థులు రెడ్ బెల్ట్ సాధించినట్లు జిల్లా తైక్వాండో ప్రధాన కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ లు శివరాజ్, వరుణ్ రాజ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం



నవ తెలంగాణ-దౌల్తాబాద్

సూరంపల్లి గ్రామంలో మాజీ జెడ్పీటీసీ చిందం రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ స్థాయిలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌లో తన స్వంత ఖర్చులతో వాలీబాల్ దుస్తులు , వాలీబాల్ క్రీడాకారులకు అందజేశారు. చిందంరాజ్ కుమార్ మాట్లాడుతూ సూరంపల్లి గ్రామంలో క్రీడాకారులు వివాదాలు లేకుండా అందరూ క్రీడాస్ఫూర్తితో ముందుకు వెళ్తే రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో మండల స్థాయిలో మంచి ప్రతిభ కనబరచాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బొల్లం స్వామి, కళాకారుడు శేఖర్, కెంబసారి నగేష్, బొల్లం రాజేష్, కెంబసరి శ్రీను,కేంబసరి మల్లేష్, బొల్లం అశోక్, అల్లిమల్లి శ్రీకాంత్,దండు భూపాల్, తొడంగి స్వామి, బొల్లం నరసింహులు బొల్లం నరేష్ ప్రభాకర్ అరవిందు అజయ్ ప్రశాంత్ గణేష్,స్వామి, బొల్లం రాజశేఖర్, బొల్లం ప్రవీణ్, జంగపల్లి విష్ణు, బొల్లం రాజేందర్, రాకేష్, శ్రీరాముల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సహకారంతో అభివృద్ధి పథంలో ధర్మాజిపేట



నవ తెలంగాణ-దుబ్బాక

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సహకారంతో ధర్మాజీపేట అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని కౌన్సిలర్ బత్తుల స్వామి తెలిపారు. దుబ్బాక పురపాలిక పరిధిలోని ధర్మాజీపేట 9వ వార్డులో టియుఎఫ్ఐడిసి నిధులు రూ.30 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు పనులను వార్డు కౌన్సిలర్ బత్తుల స్వామి ఆదివారం ప్రారంభించారు. ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక సహకారంతో తమ వార్డులో నూతనంగా సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయన్నారు. వెంకటస్వామి గౌడ్,శివరాజం గౌడ్ లోకని మల్లేశం,లోకని నర్సింలు,లోకని రాజు,సోషల్ మీడియా ఇన్చార్జి లోకని కనకరాజు, పలువురున్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం



నవతెలంగాణ- గజ్వేల్

తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరిస్తుందని గజ్వేల్ పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షులు మర్కంటి ఎగొండ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం రైతులకు మాయమాటలు చెబుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను తీసుకుంటూ తామే ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తుందన్నారు. 2023 ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి అధికారంలో రావటానికి అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. గజ్వేల్ నియోజకవర్గంలో బిజెపి జెండాను ఎగరవేస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఎండగడతామన్నారు.

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి



నవతెలంగాణ-తొగుట

చేపల వేటకు వెళ్లి చేపలు పడుతున్న క్రమంలో వల కాళ్లకు, చేతులకు చుట్టుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కాన్‌గల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ బి.కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆ గ్రామానికి చెందిన కాముని తిరుపతి (38) శనివారం సాయంత్రం 7 గంటలకు గ్రామ పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. రాత్రి పొద్దుపోయే వరకు రాక పోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఆదివారం ఉదయం పెద్ద చెరువులో తిరుపతి శవం లభించింది. అతని బట్టలు, మోటార్ సైకిల్, చెప్పులు చెరువు కట్టమీద ఉన్నాయి. చేపలు పట్టడానికి వెళ్లిన తిరుపతి చేపల కోసం వేసిన వల అతని కాళ్లకు, చేతులకు చుట్టుకొని ప్రమాదవ శాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతుని భార్య కామని కనక లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మెరుగైన వైద్యం అందించడమే సుధా హాస్పిటల్ లక్ష్యం



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చులో మెరుగైన వైద్య సేవల్ని అందించడమే సుధా హాస్పిటల్ లక్ష్యమని డా.రఘువర్ధన్ అన్నారు. మండల పరిధిలోని బల్వంతాపూర్ గ్రామంలో "డాక్టర్ బచ్చు పద్మనాభం జ్ఞాపకార్థం "సుధా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపును ఆదివారం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి,మందులను పంపిణీ చేశామన్నారు. వైద్య బృందం డా.షాహిస్తా,వైద్య సిబ్బంది పాశికంటి దయాకర్, పలువురున్నారు.

17న దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-బెజ్జంకి

ఈ నెల 17న మండల కేంద్రంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య వైద్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరవుతున్నారని, మండలంలోని ప్రజలు అధిక సంఖ్యలో హజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్తల సమావేశానికి ఎమ్మెల్యే రసమయి హజరై మాట్లాడారు.అనంతరం సభాస్థలాన్ని పరిశీలించారు.

వద్దన్నా తీసుకోవాల్సిందే.. లేదంటే కోతలు

- బీడీ కార్ఖానలో పల్లీలు, బఠానీలు, కుర్‌కురేలు
- దేశాయి కంపెనీ నుంచి నేరుగా బీడీ కార్ఖాన్లకు సరఫరా
- అన్ని గ్రామాల్లో బీడీ కార్మికులకు పంపిణీ
- ఒక్కొక్కరికి 14 ప్యాకెట్లు.. రూ.140 వసూలు
- అయోమయంలో బీడీ మహిళా కార్మికులు
- పట్టించుకోని అధికారులు





నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

పని చేసుకోవడానికి వ్యవసాయ భూమి లేక... ఉపాధి దొరకక తన కుటుంబాన్ని పోషించుకోవడానికి పని చేస్తేనే పూట గడుస్తుందని ఎన్నో కుటుంబాలు ఇంటి వద్ద ఉంటూ బీడీలు చుడుతూ రోజుకు వచ్చే రూ.100 నుంచి రూ.150లతో కుటుంబ భారం మోస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు చేసిన బీడీ కట్టల ఆధారంగా వాటి నాణ్యతను పరిశీలించి మునీం (టేకేదార్) వాటిని లెక్కగట్టి కోతలు విధించి వారికి వేతనం చెల్లిస్తాడు. మహిళలు రోజంతా బీడీలు చుట్టడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. బయట నిత్యావసర సరుకులు, గ్యాస్ ధరలు పెరగడంతో వచ్చిన జీతం సరిపడక... అప్పులు చేసి జీవనం సాగిస్తున్నారు. గ్రామాలలో బీడీ కార్ఖానలో పనిచేసే చాలా మంది మహిళలు చదువు రానివారు ఉంటారు. దీనిని ఆసరాగా తీసుకొని దేశాయ్ కంపెనీ వారు డీబీఎల్ కంపెనీ తయారుచేసిన పల్లీలు బఠానీ పప్పులు, కురుకురేలును కంపెనీ ప్రచార నిమిత్తం బయట మార్కెట్లో విక్రయించకుండా టేకేదార్ (మునీం) ద్వారా బీడీ కార్ఖానలో పనిచేసే మహిళలకు అంటగడుతున్నారు. బీడీలు చుడుతున్న మహిళలకు అమ్మాలని టేకేదార్లకు రూ.10 వేల నుంచి రూ.20 వేల సరుకులు ముడి పెడుతున్నారు. టేకేదారులపై అదనపు పనితో.. అదనపు ఆదాయాన్ని కంపెనీ సమకూర్చుకుంటోంది. టేకేదారులకు అధిక భారంతో పెద్ద తలనొప్పి సమస్యగా మారింది. ఎలాగైనా వీటిని అమ్మాలి కాబట్టి కార్ఖానలో పని చేసే కార్మికులకు టార్గెట్‌గా తీసుకుంటున్నారు. సిద్దిపేట జిల్లాలో రూరల్ మండల గ్రామాలల్లోని బీడీ కార్ఖానలో రెండు నెలలకు ఒకసారి ఒక్కో మహిళకు 14 ప్యాకెట్ల చొప్పున రూ.140 తీసుకొని వీటిని అమ్ముతున్నారు. తమకు ఎందుకు ఇస్తున్నారని మహిళలు అడిగితే కంపెనీ నుంచి పంపిణీ చేశారు... ప్రతి ఒక్కరూ తీసుకోవాలని మునీం చెబుతున్నారు. మహిళలకు ఇష్టం లేకున్నా డబ్బులు లేకున్నా వారి వెంటపడి బతిమిలాడి వారికి అమ్ముతున్నారు. గట్టిగా అడిగితే కార్ఖానలో తంబాకు, ఆకు, బీడీల నాణ్యత దగ్గర ఇబ్బంది పెడతారనే ఉద్దేశంతో ఎవరూ ముందుకు వచ్చి అడగడం లేదు. అందరూ తీసుకుంటున్నారు.. తాము కూడా తీసుకుంటున్నామని అంటున్నారు. బీడీలు చేసే మహిళలకు తంబాకు వాసనతో అనారోగ్య సమస్యలు వస్తాయి. బండారాలను మార్కెట్లో విక్రయించకుండా బీడీలు చేసే మహిళలకు అమ్ముతున్నారు. ఈ విషయంపై కంపెనీవారిని అడిగితే కంపెనీ తయారు చేస్తుంది.. ప్రచార నిమిత్తం కోసం పంపిణీ చేస్తున్నామని చెబుతున్నారు.

దేశాయ్ కంపెనీ పై చర్యలు తీసుకోవాలి

బీడీ కార్ఖానలో పనిచేసే మహిళలకు ఆకూ, తంబాకు, పంపిణీ చేయాలి. కిరాణం షాప్‌లో చిన్నపిల్లలకు అమ్మే చిప్స్, బఠాని, కురుకురేలు పంపిణీ చేసి మహిళలకు వచ్చిన ఆదాయాన్ని తిరిగి కంపెనీ దోచుకుంటోంది. కురుకురేలు సరఫరా చేస్తున్న దేశాయ్ కంపెనీలో తనిఖీలు చేసి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.



– మామిడాల కనకయ్య, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు

అడిగితే బెదిరిస్తున్నారు



పని చేసుకోవడానికి జాగలేక ఉపాధి లభించక బీడీలు చేసుకుంటూ.. వచ్చిన డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. రోజంతా చేస్తే వంద రూపాయలు వస్తాయి. కార్ఖానలో మాకు ఆకు, తంబాకు సరిగ్గా ఉండదు. కష్టపడి బీడీలు చేస్తున్నాం. ఇప్పుడు కురుకురేలు, పప్పు, బఠాని, పల్లీలు తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. బీడీలు చేసిన డబ్బులు అడిగితే కంపెనీ పేరుతో దోచుకుంటున్నారు. గట్టిగా అడిగితే బెదిరిస్తున్నారు.

– గడ్డం లక్ష్మి, బీడీ కార్మికుల వెంకటాపూర్

కుర్‌కురేలు వద్దు

మా బతుకులు మార్చడానికి కష్టపడ్డ దానికి అదనంగా ఆకు తంబాకు సరిగ్గా వేసి మాకు మరింత ఆదాయాన్ని చేకూర్చే విధంగా ఇవ్వండి. పిల్లలు తినే సరుకులు ఇస్తే వాటిని మేం ఏం చేసుకోవాలి. మాకు కుటుంబానికి ఉపయోగపడేవి ఇవ్వండి. తీసుకుంటాం. కుర్‌కురేలు ఇవ్వడం సరికాదు. అధికారులు స్పందించాలి.

–కనుకవ్వ, బీడీ కార్మికురాలు బుస్సాపూర్

13న మెగాజాబ్ మేళా

- పాల్గొననున్న 15 కంపనీలు
- యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



నవ తెలంగాణ కొండపాక

ఈ నెల 13న సిద్దిపేటలో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. ఆదివారం దుద్దెడ గ్రామ శివారులో నిర్మించిన ఐటీ టవర్ ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి హరీష్ రావు కృషితో దుద్దెడ గ్రామ శివారులో రూ.52 కోట్లతో ఐటి టవర్ ఏర్పాటు చేయడం జరిగిందని. స్థానిక యువకులకు, స్థానిక ఉద్యోగాలు ఇవ్వాలనే లక్ష్యం తో ఐటీ టవర్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈనెల 15 న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, మంత్రి హరీష్ రావు ఐటీ టవర్ ను ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సిద్దిపేట నిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల 13 మంగళవారం రోజున తెలంగాణ ఐటి మరియు టాస్క్ ఆధ్వర్యంలో సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ హల్ లో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మెగా జాబ్ మేళా లో 15 కంపనీలు పాల్గొననున్నాయని తెలిపారు. బిటెక్, ఎంబీఏ, ఎంసీఏ , బిఎస్సి కంప్యూటర్ తదితర అర్హత ఉన్న వారికి మంచి అవకాశాలు కల్పించనున్నారు. ఈ జాబ్ మేళా లో ముఖ్యఅతిథిగా మంత్రి హరీశ్ రావు పాల్గొంటారని తెలిపారు.

జాబ్ మేళాకు అన్ని ఏర్పాట్లు చేయాలి

13న జరిగే మెగా జాబ్ మేళాకు అన్ని ఏర్పాట్లు చేయాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వచ్చే కంపనీలకు స్టాల్స్ ఏర్పాటు, యువతి యువకులు ఎలాంటి ఇబ్బందులు గురి కాకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఐటీ అండ్ టాస్క్ ప్రతినిధులతో కల్పి స్టాల్స్, రిజిస్ట్రేషన్ సెంటర్స్ ఏర్పాట్లను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. యువతి యువకులు ఇంటర్వ్యూలో పాల్గొనేల గైడ్ చేసే ప్రత్యేక వలంటీర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. తాగు నీరు, మజ్జిగ, స్నాక్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఐటీ ప్రతినిధులు శ్రీనివాస్, టాస్క్ ప్రతినిధులు కుమార్, వంశీ ,మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఏఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి విస్మరించిన ప్రభుత్వాలు



నవ తెలంగాణ మిరుదొడ్డి

రైతు సంక్షేమాన్ని పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవడానికి రైతులు తీవ్ర కష్టాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ఆదివారం మీరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మగౌరవ పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో భాగంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన పరిశీలించారు. లారీల కొరత వల్ల కొనుగోలు కేంద్రంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోయారు. అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకు పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రైతుల కష్టాలు తీరుతాయని రాబోయే రోజుల్లో రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందని వెల్లడించారు. అన్నదాతల సంక్షేమంతో పాటు కష్టాల్లో ఉన్న రైతులకు కాంగ్రెస్ పార్టీ వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూమా గౌడ్, మదెల రాజేశం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

దుబ్బాకలో ఎగిరేది గులాబీ జెండా



మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి.



ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సమక్షంలో 200 మంది ఎమ్మార్పీఎస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక

నవ తెలంగాణ -దౌల్తాబాద్

ఎవరెన్ని కుట్రలు చేసినా తిరిగి మూడోసారి తెలంగాణలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని, దుబ్బాకలో ఎగిరేది గులాబీ జెండా అని మెదక్ పార్లమెంటు సభ్యులు, సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. దౌల్తాబాద్‌లోని వీఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పు శివరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 200 మంది ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దళితుల సంక్షేమం గురుంచి ఎన్నికల్లో మాట్లాడే నాయకులు తర్వాత మరిచిపోవడం మనం 70 ఏళ్లుగా చూస్తున్నామని, అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ ప్రజల గురుంచి, వారి స్థితిగతుల గురుంచి.పూర్తి స్థాయిలో తెలిసిన వ్యక్తి సీఎం కేసీఆర్ మాత్రమేనన్నారు. 70 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో దళితుల అభివృద్ధి గురుంచి మాట్లాడిన వారే తప్ప సీఎం కేసీఆర్‌లా అమలు చేసిన వారు ఎక్కడా లేరన్నారు. దళిత బంధు మీద ఎన్నో అనుమానాలు, దుష్ప్రచారం చేశారని, దశల వారీగా దిగ్విజయంగా అమలు చేసి దేశానికి స్ఫూర్తిగా నిలిపారన్నారు. నాడు కరువులో ఉన్న దౌల్తాబాద్ నేడు లారీల కొద్దీ ధాన్యం రాశులతో కళకళలాడుతోందన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రణం శ్రీనివాస్ గౌడ్, జిల్లా కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ రహిమోద్దిన్,ఎమ్మార్పీఎస్ నాయకులు గుర్రాల శ్రీనివాస్, కరికె శ్రీనివాస్, ర్యాకం శ్రీరాములు, ఎంపీపీ గజ్జెల సాయిలు, సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు స్టీవెన్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు హైమద్, దౌల్తాబాద్ సర్పంచ్ యాదగిరి, దొమ్మాట సర్పంచ్ కొమ్మేర పూజిత వెంకట్ రెడ్డి, మల్లేశం పల్లి సర్పంచ్ ధార సత్యనారాయణ, చెట్ల నర్సంపల్లి సర్పంచ్ జనార్దన్, ఎంపీటీసీలు లక్ష్మీ మోహన్ రావు, దేవేందర్, వీరమ్మ మల్లేశం, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉమ్మడి నర్సింహారెడ్డి,తిరుమలాపూర్ మాజీ సర్పంచ్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అందె లింగం,ఇప్ప దయాకర్, వనం రమేష్,పాల రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



నవ తెలంగాణ-దుబ్బాక

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన తోటి మిత్రుడు ఎండి తహర్ పాషా కుటుంబానికి 1992- 93 టెన్త్ క్లాస్ బ్యాచ్ మిత్రులు తమ వంతుగా ఆర్థిక చేయూతను అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. స్నేహితుని మరణం తమను తీవ్రంగా కలచివేసిందని విచారం వ్యక్తం చేశారు. దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట వార్డులో తహర్ పాషా కుటుంబానికి తోటి మిత్ర బృందం రూ.20వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. అవధూత బాలరాజు, మంచె శ్రీనివాస్, రాజశేఖర్, పలువురు మిత్రులు ఉన్నారు.

సంప్రదాయాలను పరిరక్షించాలి

నవతెలంగాణ వర్గల్

హిందూ ధర్మ సంస్కృతి సంప్రదాయ పరిరక్షణ లక్ష్యంగా వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రం విరాజిల్లుతోందని జగద్గురువు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్పష్టం చేశారు . స్వామివారి విజయ యాత్రలో భాగంగా ఆదివారం వర్గల్ క్షేత్రానికి అనుబంధంగా నిర్మించిన శ్రీ కంచి మఠం, శ్రీ శారదా స్మార్త వేద విద్యాలయాలను కంచి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి ప్రారంభించారు. అనంతరం భక్తులనుదేశించి స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ వర్గల్ క్షేత్రానికి కంచి మఠానికి ఎంతో అనుబంధం ఉందని పేర్కొన్నారు. శ్రీ విద్యా సరస్వతి దివ్య ధామం, విభిన్న ఆలయాల సమూహంతో ధర్మనిష్ఠకు ప్రతీకగా వికసించిందని తెలిపారు. వేద విద్యా పరిరక్షణతోపాటు అన్నదానం, ధర్మప్రచారం చక్కగా, ఆదర్శవంతంగా నిర్వహిస్తున్నట్లు కొనియాడారు. క్షేత్ర వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి అకుంఠిత దీక్ష, అమ్మవారి ఆశీస్సులు క్షేత్రవికాసానికి కారణాలని చెప్పారు. ముఖ్యంగా సంస్కృతి, ధర్మరక్షణ , సాంప్రదాయాలు జీవన విధానం కావాలని ఆకాంక్షించారు . ఆధ్యాత్మిక చైతన్యంతో ఆది శంకరులు ధర్మ పరిరక్షణకు శ్రమించగా , అదే స్ఫూర్తితో



దక్షిణ భారత దేశంలో ధర్మం, శాస్త్రం , ప్రాచీన నాగరికత రక్షించుకోవాలని అన్నారు. జీవితం పరిమితమైనదని, ఆదిశంకరుల స్ఫూర్తి, ప్రేరణ తో ధర్మం సంస్కృతితో కూడిన అభివృద్ధి జరగాలని తెలిపారు. ఆచార వ్యవహారాలు పరిరక్షించుకుంటూ సంస్కృతి సాంప్రదాయాలు హిందూ జీవన విధానం పురాతన క్షేత్రాలు తదితర వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యతను గుర్తించాలన్నారు. మొదట వర్గల్ ప్రధాన కూడలిలో కంచి స్వామివారికి భక్తులు హిందూ ధర్మ పరిరక్షకులు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారు శోభాయాత్రతో శ్రీ విద్యాధరి క్షేత్ర సముదాయానికి చేరుకోగా ఆలయ చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు జగద్గురువులు కంచి స్వామివారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు.

ఆరంభం నుండి ఫలితాలలో అదే సంచలనం

మంచి ఫలితాలు సాధిస్తున్న గురుకృప జూనియర్ కళాశాల



నవ తెలంగాణ - సిద్దిపేట

కళాశాల స్థాపన నుండి నేటి వరకు గురుకృప జూనియర్ కళాశాల విద్యార్థులు సంచలన ఫలితాలను సృష్టిస్తూ రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు పొందారు. 2023 ఐపిఈ ఫలితాలలో తెలంగాణ రాష్ట్రంలోనే ఎంపీసీ గ్రూపులో 467 మార్కులు సాధించి కీర్తిరెడ్డి రాష్ట్రంలో రెండో స్థానాన్ని, జిల్లాలో మొదటి స్థానాన్ని నిలిపారు. 27 సంవత్సరాలుగా సిద్దిపేట జిల్లాలో ఐఐటి , జేఈఈ, ఎస్ ఈ ఈ ట్, ఎంసెట్ ఫలితాలలో సత్తా చాటుతూ వచ్చింది. 35 సంవత్సరాలు పైగా అనుభవంచ, అంకితభావం ఉన్న యాజమాన్యం, ఉపాధ్యాయులతోనే ఇలాంటి ఫలితాలు సాధ్యమని కళాశాల డైరెక్టర్లు కేఎం శర్మ, రవి గౌడ్, నూరుల్లా, శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసి, సిఈ సి గ్రూపులో ఉన్నాయని తెలిపారు. జేఈఈ , ఎంసెట్, నీట్ లలో ప్రత్యేక శిక్షణలు ఇస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో అన్ని రకాల స్కాలర్షిప్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరడానికి అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని, పట్టణంలోని కంచరీ బజార్ లోగల తమ కళాశాలలో అడ్మిషన్ల కోసం సంప్రదించాలని వారు విద్యార్థులకు సూచించారు.

ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందిన ఏకైక కళాశాల ప్రతిభ డిగ్రీ, పీజీ కళాశాల



నవ తెలంగాణ - సిద్దిపేట

పట్టణంలోని మెదక్ రోడ్డులో గల ప్రతిభ డిగ్రీ, పీజీ కళాశాల ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డ్ డైజేషన్ (ఐఎస్ఓ) సర్టిఫికెట్ పొందిన ఏకైక కళాశాల. 2022 సెమిస్టర్ ఫలితాలలో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ప్రతిభ డిగ్రీ కళాశాల విద్యార్థులు సంచలన ఫలితాలను సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ సెమిస్టర్ రిజల్ట్‌లో అయినా, సాఫ్ట్వేర్ ఉద్యోగాల సాధనలో జిల్లాలో నంబర్ వన్ స్థానంలో తమ కళాశాల నిలిచిందన్నారు. ఎంపీసీ ఎస్, ఎంఎస్ సిఎస్, ఎంపీసీ, బి జెడ్ సి, ఎం బి జెడ్ సి, బి జెడ్ సి ఎస్, బీకాం కంప్యూటర్స్, బిజినెస్ అనాలటిక్స్, బి బి ఎ, బి ఎ హెచ్ ఈ పితో పాటు పీజీలో మ్యాథ్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, మాస్టర్ ఆఫ్ కామర్స్ కోర్సులు నిర్వహిస్తున్నారు.విద్యార్థులకు అన్ని రకాల స్కాలర్షిప్లు అందుబాటులో ఉన్నాయి. స్త్రీ విద్య ప్రోత్సాహం, భద్రతకి ప్రాధాన్యత ఇస్తున్నందుకు మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా ఈ మధ్యనే ఐఎస్ఓ సర్టిఫికెట్ ను అందుకున్నారు. 40 మంది విద్యార్థులు నేరుగా డిగ్రీతో పాటు సాఫ్ట్వేర్ ఉద్యోగాలు సాధించారు. ప్రణాళికమైన బోధన, మంచి శిక్షణతో ఈ ఫలితాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు.

కార్యకర్తలను ఉత్తేజ్ పరుస్తున్న దశాబ్దాలు ఉత్సవాలు



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ మండలంలో కార్యకర్తలను నాయకులను దశాబ్ది ఉత్సవాలు ఉత్తేజపరుస్తున్నాయని గజ్వేల్ మండలం బయ్యారం గ్రామ సర్పంచ్, రైతు సమితి సభ్యులు మద్దూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 9 సంవత్సరాల్లో తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల భాగస్వామ్యం చేసి వివరిస్తున్నమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గజ్వేల్ మండలం తో పాటు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. మంత్రి హరీష్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి గజ్వేల్ నియోజకవర్గం పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం దశాబ్ది ఉత్సవాల మూలంగా అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొన్నది అన్నారు. పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రతి కార్యకర్త ఉత్సవాల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. రైతుబంధు రైతు బీమా, రుణమాఫీ, కళ్యాణ్ లక్ష్మి ,షాదీ ముబారక్ తదితర సంక్షేమ పథకాలు తోపాటు పేదలకు ఇంటి స్థలం ఉంటే మూడు లక్షల రూపాయలు మంజూరు చేస్తామని చెప్పడం అభినందనీయమన్నారు. దశాబ్ది ఉత్సవాలు కార్యకర్తలందరినీ ఏకతాటిపై తెచ్చాయన్నారు.

బీజేవైఎం మండల కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ వర్గల్

మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో బీజేవైఎం మండల అధ్యక్షుడు బబ్బూరి రవీందర్ గౌడ్ అధ్యక్షతన బీజేవైఎం మండల కమిటీ ఏర్పాటు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు నందన్ గౌడ్ హాజరయ్యారు. ఈ సమావేశంలో భాగంగా మండల వ్యాప్తంగా బిజెవైఎం లో యువకులను భాగస్వామ్యం చేయడంపై చర్చించారు. బీజేపీ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతిఒక్కరు కృషిచేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో బీజేవైఎం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ , బిజెపి వర్గల్ మండల అధ్యక్షులు శ్రీరామ్ శ్రీకాంత్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ మన్నే శేఖర్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పంపరి రమేష్, బిజెపి మండల ఉపాధ్యక్షులు ప్రదీప్ గౌడ్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు మధు, కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి దిండి నాగరాజ్, కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షుడు యశ్వంత్ రెడ్డి, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


బీసీ సెల్ మండల అధ్యక్షులుగా బొల్లు సంజీవ్‌కుమార్ యాదవ్



నవతెలంగాణ-నంగునూరు

కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నంగునూరు మండల అధ్యక్షులుగా బొల్లు సంజీవ్ కుమార్ యాదవ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు సూర్యకుమార్‌వర్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరితో కలిసి నియామకం పత్రాన్ని సంజీవ్‌కు అందించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోనే బీసీ లను గుర్తించి వారికీ అన్నిరకాల న్యాయం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ముఖ్యమంత్రిగా రెండు సార్లు అధికారం చేపట్టిన కేసీఆర్ ప్రభుత్వం బీసీలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బీసీలు కళ్ళు తెరిచి రాబోయేఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దత్తు ఇచ్చి పార్టీని అధికారంలోకి తీసుకు రావలసిన భాధ్యత బీసీ అణగారిన కులాలదే అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దత్తు ఇచ్చి ఆత్మాభిమానంతో ఉండాలన్నారు. ఈ సందర్భంగా బొల్లు సంజీవ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నావంతు కృషి చేస్తానని చెప్పారు.బీసీల ఓట్లను అత్యధికముగా కాంగ్రెస్ పార్టీకి వేసేలా కృషి చేస్తానని తెలిపారు. పదవి రావడానికి కృషి చేసిన సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డికి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరికి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సూర్య వర్మకి కృతజ్ఞతలు తెలిపారు. చెలికాని యాదగిరి యాదవ్, రాగుల కృష్ణ పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగుల పాలాభిషేకం



నవ తెలంగాణ - గజ్వేల్

అడగకముందే రూ.3,016 ఉన్న పింఛన్‌ను మరో రూ.వెయ్యి పెంచిన సందర్భంగా దివ్యాంగులు ఆదివారం మండలంలోని శ్రీగిరిపల్లి లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో తిమ్మక్కపల్లి శ్రీకాంత్ గౌడ్, దివ్యాంగులు పాల్గొన్నారు.

దశాబ్దిలో గజ్వేల్ అభివృద్ధి శోబితం






నవతెలంగాణ- గజ్వేల్

తెలంగాణ ప్రభుత్వం రెండుసార్లు అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాల పరిపాలన పూర్తిచేసుకుని దశాబ్దంలోకి అడుగు పెడుతున్న తరుణంలో ఉత్సవాలు నిర్వహించుకుంటున్నారు. చేసిన అభివృద్ధిని నెమరు వేసుకుంటున్నారు. గజ్వేల్ నియోజకవర్గం జరిగిన అభివృద్ధిలో కొన్ని పరిశీలిస్తే తొమ్మిది సంవత్సరాల్లో కొంత మార్పు వచ్చింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహించడం వల్లే ఈ మార్పు వచ్చింది. కేవలం శాసనసభ్యులుగా ఉంటే ఇంత అభివృద్ధి జరిగేది కాదు. గజ్వేల్ నుండి రెండుసార్లు ఎమ్మెల్యే గెలిచి ముఖ్యమంత్రి కావడం వల్ల గజ్వేల్ అభివృద్ధి కొంత శోభితంగా కనిపిస్తుంది.

బాల బాలికలకు వేరువేరుగా..

గజ్వేల్ పట్టణంలో ప్రభుత్వ పాఠశాలలు నిర్మాణం పరిశీలిస్తే 1965-70 మధ్య గజ్వేల్లో ప్రభుత్వ పాఠశాల నిర్మాణం చేపట్టగా దశలవారీగా అదే భవనంలో 1997లో డిగ్రీ కళాశాలగా మార్చడం జరిగింది. ఆ సమయంలో ఉన్నంత విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన జిఎంసి బాలయోగి, అప్పటి రవాణా మంత్రి, ప్రస్తుతం ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పుడు ఎమ్మెల్యే డాక్టర్ విజయ రామారావు చేతుల మీదుగా డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. 2014 వరకు అందులోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల శిథిలావస్థల ఉన్న భవనంలోనే కొనసాగించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టి కేజీ టు పీజీ ఒకే చోట ఉండాలని రూ.175 కోట్లతో బాలబాలికులకు వేరువేరుగా ఎడ్యుకేషన్ భవనాలు నిర్మించారు. ఎడ్యుకేషన్ హబ్బుకు గజ్వేల్ ప్రాంతం కాకుండా తెలంగాణలోని 200 కిలోమీటర్ల దూరం నుండి విద్యార్థిని విద్యార్థులు ఇక్కడ చదువుకోవాలని ఉత్సాహంతో ఇక్కడికి వస్తున్నారు. విద్యా వసతులు, హాస్టల్, ఉపాధ్యాయుల తదితర వసతులు బాగున్నాయని ఇక్కడ చేరుతున్నారు. అదే స్థాయిలో విద్యాభ్యాసాన్ని అందిస్తున్నారు.

పెద్దలకు.. చిన్నలకు వేరుగా..

ప్రభుత్వ ఆసుపత్రి 1960లో నిర్మించారు. అదే ఆసుపత్రిని 1997లో అప్పటి టిడిపి ఎమ్మెల్యే డాక్టర్ విజయ రామారావు రూ.కోటి మంజూరు చేయించి ప్రభుత్వ ఆసుపత్రిని విస్తరించేలా చేశారు. 2014 నాటికి ఆ భవనం అంతా సరిపోకపోవడం ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత చిన్న పిల్లల కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేయడం తో సరిపోలేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ పాత డిగ్రీ కళాశాల స్థలంలో జిల్లా ఆసుపత్రి నిర్మించాలని ఆదేశించడంతో రూ 20 కోట్లతో గజ్వేల్ పట్టణంలో జిల్లా ఆసుపత్రిని నిర్మించి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. మరో విషయం ఏమిటంటే చిన్న పిల్లలకు తెలంగాణ ప్రాంతంలోని కార్పొరేట్ స్థాయిలో రూ 33 కోట్లతో తెలంగాణ ప్రాంతీయ చిల్డ్రన్ ఆసుపత్రిని నిర్మిస్తున్నారు. పనులు చివరి దశలో ఉండగా ప్రారంభం సిద్ధమవుతుంది.. తెలంగాణ ప్రాంతంలో ఈ స్థాయి చిన్నపిల్లలకు ఆసుపత్రి లేకపోవడంతో గజ్వేల్ లో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టి ఈ ఆస్పత్రిని నిర్మించారు.

అన్ని కార్యాలయాలు ఒకే చోట

గజ్వేల్ పట్టణంలో బ్లాక్ ఆఫీస్‌గా ప్రారంభమైన ఎంపీడీవో కార్యాలయంలో మారి కేవలం 40 ప్రభుత్వ కార్యాలయం కొన్ని అద్దె భవనంలో మరికొన్ని ప్రభుత్వ భవనంలో కొనసాగుతున్న తరంలో తెలంగాణ ప్రభుత్వం సమీకృత ప్రభుత్వ కార్యాలయం నిర్మించాలని ఉద్దేశంతో గజ్వేల్ లోనే రూ.19 కోట్లతో భవనాన్ని నిర్మించారు. కలెక్టరేట్ గా తలపించేలా ఉంటుంది. ఇలా అనేక కార్యక్రమాలను ఈ తొమ్మిది సంవత్సరాలు తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధిని గజ్వేల్ లో తీర్చి దిద్దిన అని చెప్పాలి.

నాడు నాలుగు గదులు.. నేడు 400 స్టాల్స్

గజ్వేల్ గ్రామపంచాయతీ ఉన్న రోజుల్లో పాత పోలీస్ స్టేషన్ వద్ద నాలుగు గదుల్లో ఉన్న మార్కెట్ ప్రస్తుతం గజ్వేల్ నడి ఒడ్డున రూ.20 కోట్లతో వెజ్ నాన్ వెజ్ మార్కెట్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో ఏర్పాటు అయింది. రోడ్లపై విక్రయించే కూరగాయల వ్యాపారులకు శాశ్వతంగా వేజ్ నాన్ వెజ్ మార్కెట్ని నిర్మించి ఇచ్చారు. 400 మందికి స్టాల్స్ ఏర్పాటు చేశారు. పండ్లు, కూరగాయలు, పువ్వులు, చేపలు విక్రయిస్తున్నారు. దీంతో 400 మంది చిరు వ్యాపారులకు ఉపాధి అవకాశాలు కల్పించారు.

నీటి కష్టాలు తీరాయి

గజ్వేల్ పట్టణంలో మంచినీటి రక్షిత ట్యాంక్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఒకటే ఉండేది. దీని ద్వారానే గజ్వేల్ పట్టణంలో చాలీచాలని నీరును ఇంటింటికి అందించేవారు. ఒకరోజు వస్తే మూడు రోజులు నీళ్ల రాలేకపోయేది. ఎప్పుడు చూసినా రోడ్లపై బిందెలు కుండలతో నిరసన తెలిపేవారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మిషన్ భగీరథ పథకాన్ని తాను ప్రాతినిధ్య వహిస్తున్న గజ్వేల్‌లో నుండే ప్రారంభించాలని ముఖ్యమంత్రి పట్టుబట్టి గజ్వేల్ మండలం కోమటి మండలం మిషన్ భగీరథ ప్లాంటును ఏర్పాటు 2016లో ఆగస్టు7న భారత ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఇప్పటికీ మహిళలకు కేసీఆర్ నీటి బిందెలో కనిపిస్తారని వివిధ రాష్ట్రాల నుండి వచ్చే ప్రజాప్రతినిధులకు ఐఏఎస్ అధికారులకు స్థానిక మహిళలు చెపుతూ ఉంటారు. నీటి కష్టాలకు కేసీఆర్ చెక్కు పెట్టాడని ఆయనను చేతులెత్తి మొక్కుతున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో జరిగిన పనులు చాలా వరకు ఉన్నప్పటికీ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మచ్చుకు కొన్ని గుర్తు చేసుకోవాలి.





బూర్గుకుంట కబ్జాపై ఆందోళన

నవ తెలంగాణ-దుబ్బాక రూరల్



దుబ్బాక మండల పరిధిలోని బల్వంతాపూర్ గ్రామంలో బూర్గుకుంట (ఊర చెఋవు) ను కొంద రు మట్టి పోసి కబ్జా చేశారు. దీన్ని గమనించిన గ్రామస్తులు ఆదివారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఇదే చెరువులో తరతరాల నుంచి బతుకమ్మ, వినాయక నిమజ్జనం చేయడం, మత్స్యకారులు చేపలు పట్టి జీవనోపాధి పొందుతున్నామ న్నారు. ఊరుకు జీవనాధారమైన కుంటను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశామన్నారు. బూరుగుకుంటను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

కానిస్టేబుల్ కుటుంబాన్ని పరామర్శించిన ఎఫ్‌డీసి చైర్మన్

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

గత వారం క్రితం రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ గురువారం మృతి మృతి చెందిన కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి కుటుంబాలన్ని రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సింగి లక్ష్మారెడ్డి గత వారం క్రితం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మెదక్‌లో నిర్వహించిన సురక్ష ఉత్సవాల్లో పాల్గొని ఇంటికి తిరుగు ప్రయాణంలో మండలంలోని పర్కిబండ గ్రామ శివారులో రోడ్డు ప్రయాదానికి గురయ్యాడు. వారం రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కాగా లక్ష్మారెడ్డి ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా ఉండేవారు. కలిసిమెలసి ఉండి ప్రజల నుండి మంచితనంతో మంచి పేరును సంపాదించాడు. కాగా ఆదివారం రాష్ట్ర అటవీ అభివృద్ది కార్పోరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రసిడెంట్ చిట్కుల్ మహిపాల్‌రెడ్డిలు ఆయన కుటుంబాన్ని పరార్శించి ఓదార్చారు. లక్ష్మారెడ్డి చేసిన సేవలను, ప్రజలతో ఆప్యాయంగా ఉండి అకాలంగా మృతి చెందడం బాదాకరమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కరుణాకర్‌రడ్డి, ఎలక్షన్‌రెడ్డి, సింగి శేఖర్‌రెడ్డి, నాయకులు నర్సింలు, వెంకటేష్, నాగరాజ్‌గౌడ్ ఉన్నారు.

ఈత వనం దగ్ధం

నవతెలంగాణ-తొగుట



గుర్తు తెలియని దుండగులు చేసిన పనికి ఈత చెట్లు తగులబడ్డాయి. ఆదివారం మండలంలోని పెద్ద మసాన్‌పల్లి గ్రామానికి చెందిన దాదాపు 100 ఈత చెట్లు పూర్తిగా తగులబడి పోయాయి. సిద్దిపేట రింగురోడ్ తొగుట నుండి దుద్దెడ కు వెళ్లే దారిలో దుద్దెడ రాములు బావి వద్ద ఈదులు కాలి పోయాయని గౌడ్ సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన దాదాపు 28 మంది గౌడ సంఘం సభ్యులు రోజు ఈదులకు కల్లు గీసి అమ్ముకొని జీవనాధారం పొందుతున్నారు. ప్రతి రోజు ఒక్కొక్కరు 4 ఈదుల కల్లు గీతతో ఉపాధి పొందుతున్నారు. రోజు రూ.400 నుండి రూ.500 వరకు ఆదాయం వస్తుందని చెప్పారు. రోజులాగే సాయంత్రం ఈదులను గీసేందుకు వెళ్లే సరికి కాలి బూడిద అయ్యాయన్నారు. గుర్తు తెలియని దుండగులు చేసిన దుచ్చర్య వల్ల 28 మంది ఉపాధి కోల్పోయామని దాదాపు 100 ఈదులు తగులబడి పోయాయన్నారు.

ముదిరాజుల అభివృద్ధికి కృషి

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

ముదిరాజులు అన్ని రంగాలలో ముందుకు సాగడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో సహకరిస్తుందని ముదిరాజ్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు ధర్మా ముదిరాజ్ అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని ముదిరాజ్ జిల్లా భవనం వద్ద ముదిరాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి హరీష్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ముదిరాజుల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని మెదక్ లో 60 గుంటల స్థలం ముదిరాజ్ భవనం కోసం కేటాయించడం సంతోషకరమని అన్నారు. ముదిరాజ్ సంఘం నాయకులు శ్రీశైలం, గట్టు నర్సింలు, పరశురాములు పాల్గొన్నారు.

ఆంజయ్య గౌడ్‌కు అరుదైన గౌరవం

నవతెలంగాణ-తొగుట



తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తరువాత ప్రభుత్వం జరుపుతున్న దశాబ్ది ఉత్సవాలలో అంజయ్య గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఆదివారం రవీంద్ర భారతిలో తెలంగాణ దశాబ్ద ఉత్సవాలు ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తొగుట మండలం వెంకట్రావు పేట గ్రామానికి చెందిన బండకాడి అంజయ్య గౌడ్ ను సన్మానించిన సందర్భంగా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సర్పంచ్ భర్తను పరామర్శించిన ఎంపీ

నవ తెలంగాణ -గజ్వేల్



గజ్వేల్ మండల్ దిలాల్పూర్ గ్రామం సర్పంచ్ దివ్య సుధ భర్త దయాకర్ రెడ్డి మోకాలికి ఇటీవల చికిత్స చేయించుకున్నారు. ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను ఆదివారం గజ్వేల్‌లోని ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య స్థితిని మెదక్ పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎఫ్డీసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, మున్సిపాల్ చైర్మన్ రాజమౌళి మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ అడిగి తెలుసుకున్నారు. చిట్కుల మహిపాల్ రెడ్డి, పంగ మల్లేశం, మండల అధ్యక్షులు బెండే మధు, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణ రెడ్డి సీనియర్ నాయకులు బయ్యారం గ్రామం సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్ రెడ్డి, గజ్వేల్ పట్టణ అధ్యక్షులు నావాజ్ మీరా, సీనియర్ నాయకులు చెప్యాల శ్రీనివాస్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు కొలిచేలిమి కుమార్ గారు, మండల అధ్యక్షులు పంగ మోహన్ బాబు, నాయకులు రామ్ రెడ్డి, బోసు, స్వామి చారి, కాస్పా రెడ్డి, మహేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.